www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 47 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com మంగళవారం 02 - 06 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool





బీజేపీకి ఏం చేశావ్?... ఈటల రాజేందర్‌ను ప్రశ్నిస్తూ హైదరాబాద్‌లో పోస్టర్లు



## పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం

- డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!
- గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి
- పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న
- పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ - మిగతా 2 లో

### దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే

# అభివృద్ధి, సంక్షేమం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలే పనిగా పెట్టుకున్నారని మండిపాటు
- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి
- ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీచేస్తే ఓర్వలేకపోయిందన్న సీఎం



**అమరావతి :**

'గతంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే వెంటనే రద్దు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల వరకు ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కుటుంబానికి దాదాపు 3, 4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.మహిళలకు 33% సీట్లు, ఉచితంగా 3 సిలిండర్లు: ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించి రాజకీయంగా ఎదిగేలా చేసేలా కృషి - మిగతా 2 లో

### మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో

## ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ



- ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో నారా లోకేష్ భేటీ
- ఏపీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు
- ఎయిర్‌ట్రంక్ సీఈఓతో సమావేశమై వైజాగ్‌కు ఆహ్వానం
- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన ఎయిర్‌ట్రంక్
- ఏపీకి ఐటీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు.ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి - మిగతా 2 లో

### దేశంలో జల వనరుల నిర్వహణ కోసం

## ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్
- దేశంలో కొత్త జల పరిశోధన కార్యక్రమాలకు నాంది
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర జలశక్తి శాఖ
- అగ్రిమెంట్‌పై సంతకాలు చేసిన ఇరువర్గాలు
- జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి





**ఢిల్లీ :**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో నీటి వనరుల నిర్వహణ కోసం శాటిలైట్ టెక్నాలజీ, అంతరిక్ష ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేసేందుకు ఈ అగ్రిమెంట్ చేసుకుంది. దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సందర్భంగా ఈ అవగాహన ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి.డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగిన వర్క్‌షాప్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి నీటి భద్రత చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. నీటికి సంబంధించిన సవాళ్లను సాంకేతికత, ఆవిష్కరణలు, సంప్రదాయ జ్ఞానం, ప్రజా భాగస్వామ్యం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. గత దశాబ్దంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అనేక పరిశోధనా అధ్యయనాలకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇందులో 113 ప్రత్యక్ష ప్రాయోజిత ప్రాజెక్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఇవి జల రంగంలో ఆచరణాత్మక - మిగతా 2 లో

### ఇరాన్ రాడార్లు.. డ్రోన్ వ్యవస్థపై

## అమెరికా భీకరదాడులు

- కువైట్ గగనతలంలోకి వచ్చిన క్షిపణులను అడ్డుకున్న ఎయిర్ డిఫెన్స్
- ఇరు దేశాల దాడులతో 2 శాతం పెరిగిన చమురు ధరలు
- భూగర్భ క్షిపణి టన్నెళ్లను వేగంగా పునరుద్ధరిస్తున్న ఇరాన్



**ఢిల్లీ :**

మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ పొడిగింపు కోసం దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేడెక్కాయి. అమెరికా, ఇరాన్ బలగాలు గత వారాంతంలో డ్రోన్లు, క్షిపణులతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్ దూకుడుకు ప్రతిగా 'ఆత్మరక్షణ దాడులు' జరిపామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించగా, ఇది తమపై జరిగిన దాడికి ప్రతీకార చర్యేనని ఇరాన్ స్పష్టం చేసింది.అంతర్జాతీయ జలాల్లో నిఘా పెట్టిన తమ ఎమ్‌క్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపించింది. దీనికి ప్రతిగా, అమెరికా ఫైటర్ జెట్లు దక్షిణ ఇరాన్‌లోని గోరుక్ ప్రాంతం, క్విష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ వ్యవస్థలు, డ్రోన్ కంట్రోల్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించినట్లు సెంట్‌కామ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో ఇరాన్‌కు - మిగతా 2 లో





## చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు

- కాకినాడ జిల్లాలో కల్లుగీత కార్మికుడి ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు
- పోలరపు సింహాచలం అనే కార్మికుడికి స్వయంగా పింఛను అందజేత
- కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశం
- గీత కార్మికుల కష్టాలు తెలుసుకుని తాటికల్లు రుచిచూసిన సీఎం

## యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

- రూ.30 లక్షల కోట్లకు చేరువైన లావాదేవీల మొత్తం విలువ
- గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరిగిన లావాదేవీల సంఖ్య
- 8కి పైగా దేశాల్లో అందుబాటులోకి వచ్చిన యూపీఐ సేవలు




# పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్

- అనుమతి నిరాకరించిన పోలీసులు
- హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ
- జూన్ 2న ఆవిర్భావ వేడుకల దృష్ట్యా భద్రతా కారణాలు చూపిన పోలీసులు
- 'జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో సభకు ప్రణాళిక
- ఈ సభపై తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ చర్చ



**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో జనసేన పార్టీ రేపు నిర్వహించ తలపెట్టిన నవనిర్మాణ సభకు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో 'జనసేన సాధక్' (యాక్టివ్ సభ్యులు) సమావేశం నిర్వహించాలనుకున్నారు. సుమారు 2,000 మంది పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసిన ఈ సమావేశానికి అనుమతిని తిరస్కరిస్తున్నట్లు సెరిలింగంపల్లి జోన్ డీసీపీ కార్యాలయం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.శాంతిభద్రతల సమస్యలు, స్థానిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. - మిగతా 2 లో

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

- ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తామన్న టీజీపీఎస్సీ ఛైర్మన్
- 3,800 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతిచ్చిందని వెల్లడి
- కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని అభ్యర్థులకు సూచన

**హైదరాబాద్ :**

నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ప్రకటన - మిగతా 2 లో

### కొత్త నాయకత్వం కోసం

## కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

- యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!
- సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం
- రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్
- టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్



**హైదరాబాద్ :**

రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ - మిగతా 2 లో

# సంపాదకీయం

## కాలాతీత బాల్యం




'టామ్.' జవాబు లేదు. 'ఒరేయ్ టామ్.' పోలీ పెద్దమ్మ పిలుపునకు ఇప్పుడు ప్రపంచం నలుమూలలా ఓ అని వినబడుతుంది. టామ్ అమెరికాలో మాత్రమే లేడుగా! వాడు ఆఫ్రికాలోనూ ఉన్నాడు, అనకాపల్లిలోనూ ఉంటాడు. అల్లరి, సాహసం కలగలిసిన ప్రతి పిల్లాడూ టామే! 1876 జూన్ 9న 'పుట్టిన' టామ్ సాయర్‌కు ఇప్పుడు 150 ఏళ్లు! కానీ ఆ తుంటరికి వయసనేది అయిపోతుందా? టామ్ సదాబాలుడు, సరదా బాలుడు; పోలీ పెద్దమ్మనే కాదు, సకల ప్రపంచాన్ని తన అల్లరి చేష్టలతో ఏలిన కౌబాలుడు. 'ది అడ్వెంచర్స్ ఆఫ్ టామ్ సాయర్' నవలను మార్క్ ట్వెయిన్ కేవలం పిల్లల కోసమే రాయలేదు. 'పెద్దవాళ్లు తమ చిన్నతనంలో తాము ఎలా ఉండేవారో, తమ ఆలోచనలు ఎలా ఉండేవో, తాము ఎలా మాట్లాడేవారో, చిత్రమైన సన్నివేశాల్లో ఎలా చిక్కుకునేవారో ఆహ్లాదకరంగా వారికి జ్ఞాపకం' చేసిందా నవల. ప్రపంచ సాహిత్య యవనికపై ఒక చిలిపి బాలుడి సాహసాలు ఇంతటి సుదీర్ఘ కాలం సజీవంగా ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఇంటి గోడకు సున్నం వేయడాన్ని కూడా ఒక కళగా మార్చి, ఇతరులతో పని చేయించుకునే తెలివితేటలున్న టామ్ నేటి మేనేజ్‌మెంట్ గురువులకు ఆది గురువు. ఈ నవల రాకముందు, అమెరికన్ సాహిత్యం ఎక్కువగా యూరోపియన్ శైలిని అనుకరిస్తూ, నీతి సూత్రాలతో నిండి ఉండేది. కానీ ట్వెయిన్ అమెరికన్ మాండలికాన్ని, సామాన్యుల భాషను సాహిత్య గౌరవ పీఠంపై కూర్చో బెట్టాడు. 'ఆధునిక అమెరికన్ సాహిత్యం అంతా మార్క్ ట్వెయిన్ రాసిన ఒకే ఒక్క పుస్తకం నుండి పుట్టింది' అని 'ది అడ్వెంచర్స్ ఆఫ్ హకల్‌బెరీ ఫిన్' (1884) నవలను కొనియాడాడు ఎర్నెస్ట్ హెమింగ్వే. ఈ నవల టామ్ సాయర్‌కు పొడిగింపు అన్నది గుర్తుంచుకుంటే దాని బీజాలు మొదటే ఉన్నాయన్నది అర్థమవుతుంది.కొన్ని కథలు రాసినా ట్వెయిన్‌కు ఇది తొలి నవల. మిసిసిపీ నది తీరాన ఉన్న హానిబాల్ గ్రామంలో గడిపిన తన సొంత బాల్య స్మృతుల నుంచే ట్వెయిన్ ఈ కథను అల్లుకున్నాడు. తనకు తెలిసిన ముగ్గురు అల్లరి పిల్లల లక్షణాలను కలిపి 'టామ్'ను సృష్టించాడంటారు. పేరును మాత్రం లోకల్ హీరో అయిన ఒక ఫైర్‌ఫైటర్ మీదుగా స్వీకరించాడు. ట్వెయిన్‌కు అతడు స్నేహితుడు కూడా. ఇద్దరూ కలిసి సాయంత్రాలు షికార్లు కొట్టేవాళు . అందరికీ ఇష్టమైన హకల్‌బెరీ ఫిన్ పాత్రనేమో తన బాల్యమిత్రుడు టామ్ బ్లాంకెరీ షిప్ ఆధారంగా రూపొందించాడు. ట్వెయిన్ చుట్టూ ఎందరు టాములో! సిడ్ సాయర్, బెకీ థాచర్, జడ్జ్ థాచర్, జో హార్పర్, విడో డగ్లస్, ఇంజన్ జో లాంటి పాత్రలు కూడా మరిచిపోలేనివి. సినిమాలుగా, టీవీ ప్రోగ్రాములుగా, మ్యూజి కల్సుగా అలరించిన టామ్ సాయర్, టైప్‌రైటర్ మీద రాసిన తొలి నవల అని ప్రచారంలో ఉంది. కానీ అది నిజానికి 'లైఫ్ ఆన్ ద మిసిసిపీ' (1883) అని మరోమాట! ఇదీ మార్క్ ట్వెయిన్‌దే కావడం గమనార్హం.పిల్లలు కేవలం మంచివాళ్లు లేదా చెడ్డవాళ్లు కాదు; వాళ్లు అల్లరి, భయం,సాహసం కలగలిసిన వాళ్లని ప్రపంచానికి చాటి చెప్పాడు ట్వెయిన్. ప్రకృతితో మమేకమవ్వడం, అన్వేషించడం నేటి పిల్లలు కోల్పోతున్న సహజ లక్షణాలు. చీకటి గుహల్లో నిధుల కోసం వెతికిన టామ్ మనకు ఇదే గుర్తు చేస్తాడు. నేటి డిజిటల్ యుగంలో, స్మార్ట్‌ఫోన్లకు బందీలైపోతున్న బాల్యానికి టామ్ సాయర్ ఒక తాళంచెవి. వందల ఏళ్లు గడిచినా, సమాజం ఎంత ఆధునీకరించబడినా మనుషుల్లోని అమాయ కత్వం, సాహస ప్రవృత్తి మారవు. అందుకే 'టామ్ సాయర్' కేవలం ఒక పుస్తకం కాదు, అది ప్రతి ఒక్కరి లోపల దాగి ఉన్న బాల్యానికి నిలువుటద్దం. ఈ 150వ వేడుకల సందర్భంగా మనలోని ఆ చిలిపి టామ్ సాయర్‌ను ఒకసారి నిద్రలేపుదాం! ఈ నవలను నండూరి రామమోహనరావు (1927--2011) టామ్ మన పక్కింటి పిల్లాడే అన్నంత హాయిగా తెలుగులోకి అనువదించాడు. రచయిత నామిని తన కొడుక్కు టామ్ సాయర్ అని పేరు పెట్టుకున్నాడు. టామ్ ఎంతటి తెలుగువాడో చెప్పడానికి ఇంతకంటే రుజువు అక్కర్లేదు. ఈ తిరుపతి టామ్ రచయితగా మారడం ఆ టామ్‌ను కన్నమార్క్ ట్వెయిన్‌కు తగిన నివాళి.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

మొదటిపేజీ తరువాయి - దేవేంద్ర ఫడ్నవీస్‌తో లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. లోకేష్ ఆయనకు తిరుమల శ్రీవారి ప్రతిమ, మంగళగిరి శాలువా బహూకరించగా, ఫడ్నవీస్ గణేశుడి విగ్రహాన్ని అందజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక అంశాలు, ఏపీలో పెట్టుబడులు, వ్యాపార అనుకూల విధానాలు, విద్యా సంస్కరణలపై వారు చర్చించుకున్నారు.లోకేష్ తన ముంబై పర్యటనలో, ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో లోకేష్ సమావేశమై విశాఖపట్నం ప్రాధాన్యతను వివరించారు. వైజాగ్‌ను ఐటీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. విశాఖలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ఎయిర్‌ట్రంక్‌ను లోకేష్ ప్రత్యేకంగా కోరారు.లోకేష్ ప్రజెంటేషన్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎయిర్‌ట్రంక్ సీఈఓ సానుకూలంగా స్పందించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఐటీ రంగంలోకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా లోకేష్ ఈ పర్యటనలు చేపడుతున్నారు.

## పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి - పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశి ంచారు.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?" అని పవన్ నిలదీశారు.పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇరాన్ రాడార్లు.. డ్రోన్ వ్యవస్థపై అమెరికా భీకరదాడులు

మొదటిపేజీ తరువాయి - చెందిన రెండు సూసైడ్ డ్రోన్లను కూడా ధ్వంసం చేశామని, తమ సైనికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది.అమెరికా దాడులకు ప్రతీకారంగా, సరిక్ ద్వీపంపై దాడిలో పాల్గొన్న ఒక అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు, తమ గగనతలంలోకి ప్రవేశించిన కొన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా నాశనం చేసినట్లు కువైట్ సైన్యం ప్రకటించింది.ఈ దాడుల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 2 శాతం పెరిగి 93.05 డాలర్లకు చేరింది. ఇదిలావుండగా, గత దాడుల్లో ధ్వంసమైన భూగర్భ క్షిపణి టన్నెళ్లను ఇరాన్ వేగంగా పునరుద్ధరిస్తోందని 'సీఎన్ఎన్' తన కథనంలో వెల్లడించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా, దెబ్బతిన్న 69 టన్నెల్ ప్రవేశ మార్గాల్లో ఇప్పటికే 50 మార్గాలను ఇరాన్ తిరిగి వినియోగంలోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ పరిణామాలు గల్ఫ్ రీజియన్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి.

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

మొదటిపేజీ తరువాయి - ద్వారా ఎంపిక చేస్తారు.సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే అభివృద్ధి, సంక్షేమం




మొదటిపేజీ తరువాయి - చేస్తున్నామన్నారు. రాష్ట్ర రైతుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నామని సీఎం అన్నారు. నేరుగా పేదవాడి ఇంటికి వచ్చి పింఛను ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. కేవలం ఈరోజు బాగుంటే చాలదు, భవిష్యత్ కూడా బాగుండేలా ప్రణాళికలు వేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, విశాఖలో గూగుల్ రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చంద్రబాబు పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే మన వాళ్లు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని. విశాఖలో గూగుల్ సంస్థ రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రాష్ట్ర యువత నైపుణ్యాలు పెంచుకొని ఉద్యోగాలు అందుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాదని ఆయన భరోసా ఇచ్చారు. గతేడాది యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతామని, రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు దరిచేరవన్నారు. అందరి జీవన ప్రమాణాలు పెరగాలన్నదే మా కల అని సీఎం వివరించారు.'పింఛన్లు ఇంటింటికే వచ్చి అందిస్తున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఏ సమస్యకైనా ఆన్‌లైన్‌లోనే పరిష్కారం చూపుతున్నాం. పీ4 కార్యక్రమం కింద పేదలను ఆదుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్, నేను కలిసి పని చేస్తున్నాం. డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తే వైఎస్సార్సీపీ ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి ఆ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'.రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యం: తిరుమల వెంకటేశ్వరస్వామి జోలికొస్తే ఆయనే చూసుకుంటారని, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం మంచి పని కాదు సీఎం హెచ్చరించారు. ఆలయాలను అపవిత్రం చేయాలని చూస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహంపై దాడి చేసి మాపై నెట్టాలని చూశారని మండిపడ్డారు. ఆరా తీస్తే వైఎస్సార్సీపీ వాళ్లే చేసినట్లు రుజువైందన్నారు. విగ్రహం ధ్వంసం చేశారని అబద్ధాలు చెప్పి సానుభూతి కోసం ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.దళితుణ్ని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఊరేగిస్తారా? అని సీఎం సూటిగా ప్రశ్నించారు. సీబీఎన్ పాలనలో అరాచక శక్తులకు చోటు లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యమని సీఎం హితవు పలికారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే మా ధ్యేయమని 2027 పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. కొత్తపల్లి మండలంలో ఫిషింగ్ హార్బర్ తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# దేశంలో జల వనరుల నిర్వహణ కోసం ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

మొదటిపేజీ తరువాయి - పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహాయపడ్డాయని తెలిపారు.ఈ వర్క్‌షాప్‌లో జల్ సంచయ్ జన భాగీదారీ ప్రచార కార్యక్రమం మూడో దశను సీఆర్ పాటిల్ ప్రారంభించారు. 2026 జూన్-2027 మే మధ్య రెండు కోట్ల నీటి సంరక్షణ నిర్మాణాలను సృష్టించాలనే లక్ష్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. గత దశలో 1.5 కోట్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త చొరవతో మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్ - వాటర్ ప్రోగ్రామ్‌ను కూడా సీఆర్ పాటిల్ ప్రారంభించారు. అలాగే భారత్ వాటర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ వేదిక కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు కోసం ఓపెన్ కాల్‌ను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని, నీటి నిర్వహణ కోసం ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేస్తుందని ఇస్రో ఛైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్ అభిప్రాయపడ్డారు. జలవనరులను పరిశీలించడానికి, ముందస్తుగా అంచనా వేయడానికి, నిర్వహించడానికి నేటి అంతరిక్ష సాంకేతికత అపూర్వమైన సామర్థ్యాన్ని అందిస్తోందని తెలిపారు. భూగర్భ జలాల అంచనా, జలవనరుల పర్యవేక్షణ, వరదల ముందస్తు అంచనా వంటి రంగాలలో పనులకు ఈ భాగస్వామ్యం మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇస్రో, జలవనరుల రంగం మధ్య సహకారం 1982 నాటిదని గుర్తు చేసుకున్నారు. మరోవైపు, మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్- వాటర్ కార్యక్రమం విద్యాసంస్థలు, ప్రయోగశాలలు, స్టార్టప్‌లు, పారిశ్రామిక భాగస్వాములతో కూడిన బహుళ సంస్థాగత ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుందని ఏఎన్ఆర్ఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివకుమార్ కళ్యాణ రామన్ అన్నారు. దిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సోమవారం (జూన్ 1న) జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో సుస్థిర భూగర్భ జలాల నిర్వహణ, సాంకేతిక ఆవిష్కరణలు, వర్షపు నీటి సేకరణపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, నిపుణులు పాల్గొని పలు విషయాలు చర్చించారు. దేశంలో నీటి ఆవిష్కరణల భవిష్యత్తుపై చర్చించడానికి నిపుణులు, పరిశోధకులకు ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా మారింది.

# యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు




మొదటిపేజీ తరువాయి - భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ తన వృద్ధిని బలంగా కొనసాగిస్తోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే లావాదేవీలు మే నెలలో మరోసారి సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ నెలలో లావాదేవీల సంఖ్య (వాల్యూమ్) 23.20 బిలియన్లకు చేరగా, వాటి విలువ దాదాపు రూ.30 లక్షల కోట్ల మార్కును తాకింది. ఈ వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి.ఎన్‌పీసీఐ డేటా ప్రకారం.. మే నెలలో యూపీఐ ద్వారా మొత్తం రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 24 శాతం పెరగ్గా, వాటి విలువ 19 శాతం వృద్ధి చెందింది. మే నెలలో సగటున రోజుకు సుమారు 748 మిలియన్ల లావాదేవీలు జరిగాయని, వాటి సగటు విలువ రోజుకు సుమారు రూ.96,465 కోట్లుగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ నెలతో పోల్చినా లావాదేవీల సంఖ్యలో 3.8 శాతం, విలువలో 3 శాతం పెరుగుదల కనిపించింది.గత ఏప్రిల్ నెలలో కూడా డిజిటల్ చెల్లింపులు 25 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తూ 22.35 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వాటి విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. యూపీఐతో పాటు, ఇతర డిజిటల్ చెల్లింపులైన ఇమ్మీడియట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ద్వారా మే నెలలో 358 మిలియన్ల లావాదేవీలు, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా 88 మిలియన్ల లావాదేవీలు జరిగాయి.కేవలం దేశంలోనే కాకుండా, యూపీఐ సేవలు అంతర్జాతీయంగా కూడా విస్తరిస్తు న్నాయి. యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్, ఖతార్‌తో సహా 8కి పైగా దేశాల్లో ప్రస్తుతం యూపీఐ అందుబాటులో ఉంది. దీంతో డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహిస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో ఏకంగా 12,000 రెట్ల అసాధారణ వృద్ధి నమోదైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్లుగా ఉన్న లావాదేవీలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి 24,162 కోట్లకు పైగా పెరగడం విశేషం.

# చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు



మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి చంద్రబాబు 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. సోమవారం కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో పర్యటించిన ఆయన, కల్లుగీత కార్మికుడు పోలరపు సింహాచలం ఇంటికి స్వయంగా వెళ్లారు. ఆయనకు రావాల్సిన పింఛనును చేతికి అందించి ఆశ్చర్యపరిచారు.ఈ సందర్భంగా సింహాచలం కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, వారి జీవన విధానం గురించి ఆరా తీశారు. అత్యంత శ్రమతో కూడిన కల్లుగీత వృత్తిలోని కష్టనష్టాలు, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో, తమకు సొంత ఇల్లు లేదని సింహాచలం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు.అనంతరం, తాటి చెట్టు నుంచి కల్లు తీసే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. గీత కార్మికులు అప్పుడే తీసిన తాజా తాటి కల్లును రుచి చూశారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పేద ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

# పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్




మొదటిపేజీ తరువాయి - ఇటీవల ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఏపీకి చెందిన జనసేన సహా కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని పోలీసులు తెలిపారు. ఈ పరిణామాల వల్ల తెలంగాణలోని విద్యార్థి సంఘాలు, ఇతర బృందాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని వివరించారు.అంతేకాకుండా, జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఈ సమయంలో సమావేశం నిర్వహించడం సమంజసం కాదని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని, నిరసనలు, ఆందోళనలు జరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.వీటితో పాటు, సమావేశం జరగాల్సిన సంధ్యా కన్వెన్షన్‌కు తగినంత పార్కింగ్ సౌకర్యం లేదని విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. నిర్వాహకులు పార్కింగ్ కోసం ప్రతిపాదించిన ఎఫ్‌సీఐ సొసైటీ లేఅవుట్‌కు సంబంధించిన స్థలంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నాయని, ఆ స్థలంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తమ ఉత్తర్వుల్లో వివరించారు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రజా శాంతికి భంగం కలగకూడదనే ఉద్దేశంతో సమావేశానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ తాళ్లూరి రామ్ ఈ సమావేశం కోసం మే 29న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ - నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

మొదటిపేజీ తరువాయి - చేసింది. నోటిఫికేషన్‌ల విడుదలతోపాటు పరీక్ష విధానంలో తీసుకురానున్న మార్పులపై టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కీలక వివరాలను వెల్లడించారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పారు. కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఊపందుకోనుంది. టీజీపీఎస్సీ ద్వారా అనేక ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నెలలో 2 నుంచి 3 నోటిఫికేషన్‌లు విడుదల చేస్తామన్నారు. నేడు ఒకేసారి 3 కొత్త ఉద్యోగ ప్రకటనలిస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 3800 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. టీజీపీఎస్సీలో ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, మరో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలున్నాయని వివరించారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదలచేసే యోచనలో ఉన్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.పరీక్షల నిర్వహణలో లీకేజీలకు తావులేకుండా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ వివరించారు. భవిష్యత్‌తో పరీక్షలను ఎావీ= విధానంలో కాకుండా, కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఆ విధానంలో పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులకి మార్కులు తెలిసే అవకాశం ఉంటుందన్నారు. యూపీఎస్సీకి చెందిన ప్రతిభాసేతు తరహాలో రాష్ట్రంలో ప్రతిభా భారతి కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొలువులివ్వడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం తెలిపారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదన్నారు." నేడు మూడు నోటిఫికేషన్లు వస్తాయి. మరో వారంలోనే మరికొన్ని ఉద్యోగ భర్తీకి ప్రకటన లొస్తాయి. ఈనెలలోనే సుమారుగా 5 నుంచి 6 నోటిఫికేషన్‌లు ఇస్తాం. తక్కువ పోస్టులున్న వాటిని ఎలా భర్తీ చేయాలో ఆలోచన చేస్తున్నాం. ప్రతి రెండు మూడు నెలలకు ఫలితాలను ప్రకటిస్తాం. మూడు నుంచి గరిష్టంగా 6 నెలల కాలంలో ఉద్యోగాల్లో చేరాలా చర్యలు తీసుకుంటాం. టీజీపీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేయడం మంచిదికాదు"

# ప్రమాదానికి ఆహ్వానం పలుకుతున్న చెట్లు,... నిద్రావస్తలో విద్యుత్ శాఖ.?

## అశోక్‌నగర్--నెహ్రూనగర్ ప్రధాన రహదారిపై పెరుగుతున్న ప్రమాదం



కాప్రా,జూన్01.అక్షర టైమ్స్:- అశోక్‌నగర్--నెహ్రూనగర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న అధిక విద్యుత్ ప్రవాహ తీగలను భారీగా పెరిగిన చెట్ల కొమ్మలు చుట్టుముట్టడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు నేరుగా విద్యుత్ తీగలను తాకే స్థితికి చేరుకోవడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో బలమైన గాలులు, ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉంది. దీంతో షార్ట్‌సర్క్యూట్‌లు, విద్యుత్ సరఫరా అంతరాయాలు, అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటమే కాకుండా సమీప ప్రాంతాల ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది.ఈ రహదారిపై ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదం జరగకముందే ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో కూడా చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను తాకడంతో విద్యుత్ అంతరాయాలు ఏర్పడిన సందర్భాలు ఉన్నాయని వారు గుర్తు చేస్తున్నారు.అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# స్మశాన వాటికకు కనీస వసతులు,కాలనీలకు సీసీ రోడ్లు కావాలి

## ఆంజనేయులు సాగర్

కొండాపూర్,జూన్01అక్షర టైమ్స్:-ప్రతినిధి : అంజయ్యనగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ స్మశాన వాటిక అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించడంతో పాటు, డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని అంజయ్యనగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా చీఫ్ ఇంజినీర్ శ్రీ లక్ష్మీ గారికి వినతిపత్రం అందజేసి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరించారు.

**స్మశాన వాటికలో దయనీయ స్థితి :**

అంత్యక్రియలకు ఇబ్బందులు: రాజీవ్ నగర్ స్మశాన వాటిక ప్రస్తుతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అక్కడ చెత్త పేరుకుపోవడం, పొదలు మరియు చెట్లు విపరీతంగా పెరగడం వల్ల ప్రజలు అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస వసతుల లేమి: స్మశాన వాటికలో కనీస అవసరాలైన వీధి దీపాలు, మరుగుదొడ్లు, మరియు తాగునీటి సౌకర్యం లేకపోవడం వల్ల రాజీవ్ నగర్, దాని పరిసర ప్రాంతాల



ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆంజనేయులు సాగర్ పేర్కొన్నారు.

**అధ్వాన్నంగా మారిన సీసీ రోడ్లు**

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని బంజారా బస్తీ, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.ఈ రహదారులు ప్రధాన రహదారులతో అనుసంధానమై ఉండటం వల్ల ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, ఉద్యోగులు, మరియు వాహనదారులు ఈ మార్గాల గుండానే ప్రయాణిస్తుంటారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరడం, ఇప్పటికే రోడ్లు గుంతలమయంగా ఉండటం వల్ల ప్రమాదాల ముప్పు



విపరీతంగా పెరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు."ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రమాదాలను నివారించడానికి వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలి.ఆంజనేయులు సాగర్ అధికారుల సానుకూల స్పందన వినతిపత్రాన్ని స్వీకరించిన చీఫ్ ఇంజినీర్ శ్రీ లక్ష్మీ సమస్యలపై సానుకూలంగా స్పందించారు. త్వరట్లోనే క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సురేష్ సాగర్, వెంకటేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆహ్వానం

## కమిషనర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్



శేర్లింగంపల్లి,జూన్01.అక్షర టైమ్స్:-ప్రతినిధి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సైబరాబాద్ ప్రజలందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా డా" జి.సృజన కమిషనర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ స్ఫూర్తి ఆశయాలు మరియు అభివృద్ధి ప్రస్థానానికి నివాళులర్పించనున్నారు.కార్యక్రమ వివరాలు వేదిక సీఎంసీ ప్రధాన కార్యాలయం జూన్ 02 తేదీ సమయం ఉదయం 07:30 గంటలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ, పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, అభివృద్ధి చెందుతున్న మరియు ప్రజాకేంద్రిత సైబరాబాద్ నిర్మాణానికి పునరంకితమవుదామని కమిషనర్ పిలుపునిచ్చారు.ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# హైదరాబాద్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసిన దానిపై వివాదం తగదు

కాకినాడ,జూన్01.అక్షర టైమ్స్:- హైదరాబాద్‌లో తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన నందమూరి తారక రామారావు విగ్రహం చుట్టూ ఇటీవల నెలకొన్న వివాదం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విగ్రహాన్ని తొలగించాలని కొందరు చేస్తున్న వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి, చరిత్ర పట్ల చూపాల్సిన గౌరవానికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఎన్టీఆర్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని జాతీయ స్థాయిలో చాటిన మహానేత. సినీరంగంలో అగ్రస్థానాన్ని అధిరోహించిన ఆయన, రాజకీయాల్లోకి ప్రవేశించి తెలుగు ప్రజల స్వాభిమానాన్ని కాపాడేందుకు ఉద్యమం నడిపారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది.ఒక వ్యక్తి సిద్ధాంతాలతో లేదా రాజకీయాలతో విభేదించడం సహజం. కానీ ఆయన చరిత్రను, సమాజానికి చేసిన సేవలను తిరస్కరించడం సరైన పద్ధతి కాదు. విగ్రహాలు కేవలం రాతి లేదా లోహంతో చేసిన నిర్మాణాలు కావు. అవి ఒక కాలానికి, ఒక ఉద్యమానికి, ఒక నాయకుడి సేవలకు ప్రతీకలు. వాటిని రాజకీయ కక్షల కోణంలో చూడడం సమాజానికి మంచి సంకేతం కాదు.ప్రజాస్వామ్యంలో విమర్శలు ఉండాలి. చర్చలు జరగాలి. కానీ వ్యక్తుల కృషిని, చారిత్రక పాత్రను అవమానించే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య సంస్కృతిని బలహీనపరుస్తుంది. నేడు ఎన్టీఆర్ విగ్రహంపై వివాదం సృష్టిస్తే, రేపు మరొక మహానేత విగ్రహంపై కూడా ఇలాంటి వాదనలు రావచ్చు. ఇది సమాజంలో అనవసర విభేదాలకు దారితీసే ప్రమాదం ఉంది.తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ స్థానం శాశ్వతం. విగ్రహాన్ని తొలగిస్తామని చేసే వ్యాఖ్యలు ఆయనపై ప్రజల్లో ఉన్న గౌరవాన్ని తగ్గించలేవు. చరిత్రను మార్చడం ఎవరి వల్లా కాదు. చరిత్రను గౌరవించడం, మహానుభావుల సేవలను గుర్తుంచుకోవడం ప్రతి తరానికి బాధ్యత.ఎన్టీఆర్ విగ్రహం వివాదం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, చరిత్ర మరియు ప్రజల భావోద్వేగాల కోణంలో చూడాల్సిన అంశం. విభేదాలు ఉండొచ్చు, విమర్శలు ఉండొచ్చు. కానీ మహానేతల సేవలను అవమానించే వ్యాఖ్యలు సమాజానికి మేలు చేయవు. తెలుగు జాతి గర్వకారణమైన ఎన్టీఆర్ వంటి



నాయకుల వారసత్వాన్ని కాపాడటం, గౌరవించడం ప్రతి తెలుగువాడి బాధ్యత.విగ్రహాన్ని తొలగించాలని అనుకోవచ్చు..కానీ ప్రజల హృదయాల్లో చెక్కుకున్న ఎన్టీఆర్ స్థానాన్ని ఎవరూ తొలగించలేరు.ఎన్టీఆర్ ఒక అసామాన్యమైన మహోన్నత వ్యక్తి. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక. అందుకే తెలుగువాడైన పీవీ నరసింహారావు కాంగ్రెస్ పార్టీ ఎంపీగా పోటీ చేసినప్పుడు ఆయనపై టిడిపి నుంచి పోటీ పెట్టకుండా తెలుగుజాతి గౌరవాన్ని అభిమానాన్ని చాటిన వ్యక్తి ఎన్టీఆర్.అందుకే దేశంలోని అత్యున్నతమైన పార్లమెంట్లో సైతం ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి.ఒక్క తెలుగుజాతే కాదు, యావత్ భారతజాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు చిరస్మరణీయం.పార్టీలకు, కుల మతాలకు అతీతంగా అందరూ స్మరించుకునే మర్చిపోలేని మహానేత, యుగపురుషుడు అన్న నందమూరి తారక రామారావు.హైదరాబాద్ మహానగర అభివృద్ధికి అంకురార్పణ చేసిన మహనీయుడు, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అన్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు.పటేల్ పట్వారి వ్యవస్థలను రద్దుచేసి బడుగు బలహీన వర్గాలకు ప్రజాస్వామ్యాన్ని అందించిన మహనీయుడు ఎన్టీఆర్ బీసి,ఎస్సి,ఎస్టి,మైనారిటీలకు రాజకీయ,ఆర్థిక, సామాజిక అంశాలలో ప్రాధాన్యత కల్పించిన దార్శనికుడు ఎన్టీఆర్ వ్యర్థ పదార్థాలతో కుళ్ళి కంపు కొడుతున్న హుస్సేన్ సాగర్ ను అభివృద్ధి చేసి, బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాక ట్యాంక్ బండ్ పై కవులు, మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసి జంట నగరాలకే కాక ఇతర ప్రాంతాల ప్రజలకు సైతం టూరిస్ట్ ప్రాంతంగా తీర్చిదిద్దిన ఎన్టీఆర్ కారణజన్ముడు.అందుకే ఆనాడు ఆయన పేరుతో హైదరాబాద్ లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ ఘాట్ చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచింది.ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై వివాదాలకు తెరదించుదాం, స్ఫూర్తిని చాటుదాం అన్నారు.



డా. మేడపాటి ఇమ్మానుయేల్

# 18 కిలోల గంజాయిని పట్టించిన ప్రైవేట్ బస్ ట్రావెల్స్ కండక్టర్

## - సన్మానించిన కుకట్ పల్లి డిసిపి రితిరాజ్



శేరిలింగంపల్లి,జూన్01.అక్షర టైమ్స్:-ప్రతినిధి : మే 30 న రాత్రి సుమారు 8 గంటల సమయమున ఆరుగురు వ్యక్తులు హైదరాబాద్ లోని మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద నుండి ఔరంగాబాద్ కు వెళ్ళుట గురించి షిర్డీకి వెళుచున్న బస్ లో లగేజి బ్యాగ్ పెట్టుచుండగా బస్ కండక్టర్ కు అనుమానం వచ్చి ఆ బ్యాగ్ లో ఉన్న వస్తువుల గురించి విచారించగా ఆ వ్యక్తులు సరైన సమాధానం చెప్పకుండా అనుమాన స్పదంగా అక్కడి నుండి పారిపోయినారు. అట్టి లగేజి బ్యాగ్ ను కండక్టర్ మియాపూర్ పోలిస్ స్టేషన్ కు తీసుకు వచ్చి ఈ విషయం తెలియపరచగా పోలిస్ వారు పంచుల సమక్షములో పంచనామా నిర్వహించి స్వాధీన చేసుకొని తూకం వేయగా గంజాయి సుమారు 18 కిలోలు గా ఉన్నది. ఇట్టి దాని విలువ మార్కెట్ లో సుమారు 20 లక్షల వరకు ఉంటుంది. ఈ విషయములో మియాపూర్ పోలిస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇట్టి గంజాయిని రవాణ చేస్తున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొనుట గురించి ప్రత్యేక దళాలను ఏర్పాటు చేయనైనది. గంజాయిని పట్టించిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్ కండక్టర్ ను కుకట్ పల్లి డిసిపి రితిరాజ్ శాలువా కప్పి సన్మానించి నగదు ప్రోత్సాహం అందించినారు.

# నల్లగండ్ల డ్రైనేజీ సమస్యపై ప్రజావాణిలో వినతి

శేరిలింగంపల్లి,జూన్01.అక్షర టైమ్స్:-ప్రతినిధి : నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి సాయి కాలనీ, కేశవ్ నగర్ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం కొండాపూర్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్ ప్రజావాణిలో శేరిలింగంపల్లి డీజీఎంకు బీఆర్ఎస్ నాయకులు రాగం హరి శంకర్ యాదవ్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



గతంలో పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. డ్రైనేజీ లీకేజీల వల్ల స్థానికులు నరకం చూస్తున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన డీజీఎం.. సమస్య ఉన్న ప్రాంతాన్ని వెంటనే సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత మేనేజర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రాజ్, రవికుమార్, సాయిరామ్, అరుణ్, నరేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.దీనివల్ల అధికారులపై ఒత్తిడి పెరిగి సమస్య త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుంది. మీకు ఇంకా ఇందులో ఏదైనా మార్పులు కావాలా.?

# బోడుప్పల్ రోడ్లకు మహర్దశ

## - రూ.2.30 కోట్ల నిధులతో డ్రైనేజ్,సీసీ రోడ్డు పనులు ప్రారంభం

## - అభివృద్ధి పనులను పర్యవేక్షించిన తోటకూర అజయ్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు





ఉప్పల్,జూన్01.అక్షర టైమ్స్:- మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లో అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సేవలు అందించేందుకు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. సోమవారం బోడుప్పల్ బచ్పన్ స్కూల్ మేడిప్లస్ నుండి అమృత బార్ వద్ద ఉన్న మెడిప్లస్ వరకు నూతనంగా వేయనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ గత పాలకుల వైఫల్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే త్వరితగతిన పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని అందులో భాగంగానే రూ.2.30 కోట్లతో పనులను ప్రారంభం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కొత్త దుర్గమ్మ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్, సీసా వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు హరినాథ్ రెడ్డి, కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్, అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# రెండు సంవత్సరాల్లో రూ.3.5 లక్షల కోట్ల అప్పులు చేశారు


## దాడిశెట్టి




కాకినాడ,జూన్01.అక్షర టైమ్స్:- కాకినాడలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా కూటమి ప్రభుత్వం,సీఎం చంద్రబాబు నాయుడుపై సోమవారం తీవ్ర విమర్శలు చేశారు.తుని పర్యటనలో చంద్రబాబు అసత్యాలు, అబద్ధాలే చెప్పారని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేశారని, వాటిని కప్పిపుచ్చేందుకే దారి మళ్లిస్తున్నారన్నారు. రెండు సంవత్సరాల్లో రూ.3.5 లక్షల కోట్ల అప్పులు చేశారని, రాష్ట్ర ప్రజలకు మీరు చేసింది ఏంటని రాజా ప్రశ్నించారు.

# పీర్జాదిగూడలో ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం





మేడిపల్లి,జూన్01.అక్షర టైమ్స్:- పీర్జాదిగూడలో నిర్వహించిన బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి. ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. యువత మన ఆచారాలను, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉంది. భక్తులందరికీ బీరప్ప స్వామి ఆశీస్సులు లభించి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కుర్ర శ్రీకాంత్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ప్రతి అర్హుడికి భరోసా అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పం..
- ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు






**కాకినాడ,జూన్01.అక్షర టైమ్స్:-** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వశీ పాలన సాగిస్తుందని, ప్రతి అర్హుడికి భరోసా అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పం అని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.కాకినాడ నియోజకవర్గంలోని స్థానిక 45 వ డివిజన్ నందు నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ములను అందజేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ., ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ చేరవేస్తోందని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి నెల ఒకటవ తేదీన సచివాలయ సిబ్బంది కూటమి శ్రేణులు పెన్షన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి తెల్లవారు జామునే పెన్షన్ను అందజేయడంతో ప్రతీ లబ్ధిదారుడు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మళ్లీపూడి వీరు, కార్పొరేషన్ టీపీఆర్వో శైలజ, పల్లా సురేష్, స్థానిక నాయకులు గుమ్మల్ల వెంకటేశ్వరరావు, ముడే రాజబాబు, కేలంగి ప్రసాద్, సుంకర శ్రీనివాస్, చింతల మంగ, సుంకర శ్రీనివాస్, ముమ్మడి త్రిమూర్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం





**గోకవరం,జూన్01.అక్షర టైమ్స్:-** గోకవరం మండలం గుమ్మాల్లదొడ్డి గ్రామంలో సోమవారం 100 రోజుల టీబి ముక్త్ భారత్ అభియాన్ జన్ భగీదారి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పీహెచ్ సి వైద్యాధికారి తిరన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి అంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని మందులతో చికిత్స చేసి నయం చేయవచ్చని అవగాహన కల్పించారు. మండలంలో ఎంపిక కాబడిన హైరిస్క్ గ్రామాలలో మొబైల్ హ్యాండ్ హెల్డ్ ఎక్సరే మెషిన్ తో ఎక్సరే లు తీయడం జరుగుతుందన్నారు .గ్రామంలో వారికి స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి ఎక్సరేలతో పాటు నాట్ టెస్టులు చేస్తారని తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఎస్.టి.ఎస్ శ్రీనివాస్,ఎస్.టి.ఎల్.ఎస్ అమృత,ఎమ్.ఎల్.హెచ్.పి జానకి,ఏ.ఎన్.ఎమ్ సుధారాణి,ఆశాలు సత్యవేణి, యు.దేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించుట మరియు ప్రవేశ కార్యక్రమం



**దేవీపట్నం,జూన్01.అక్షర టైమ్స్:-** దేవీపట్నం మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగి ఉన్న విద్యార్థులను 6 నుండి 18 సంవత్సరాల వరకు గుర్తించి వారిని పాఠశాల యందు చేర్పించి సాధారణ పిల్లల వలే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక విద్యను అందించి ప్రయోజకులుగా తీర్చుట జరుగుచున్నది రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు 2026 --27 విద్యా సంవత్సరానికి గాను అనేక విధాలుగా ఆర్థిక సాయం అందిస్తున్నది అందులో భాగంగా ఉచిత విద్య ప్రత్యేక సహాయ సేవలు ఉపకరణాలు మరియు సహాయ పరికరాలు స్కాలర్షిప్లు తెరపి మరియు రిసోర్స్ రూమ్ సపోర్టు ఈ విధంగా ఉచిత విద్యను అందించబడుచున్నది ఈ కార్యక్రమంలో మండల పరిధిలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ గా పనిచేస్తున్న చంద్రపాల్ పాల్గొనడం జరిగింది.

## చంద్రబాబు అంటేనే సంక్షేమం

- రూ.4000 నుండి రూ.15000 వరకు పెన్షన్ ఇస్తున్న ఘనత చంద్రబాబుదే :ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**గోకవరం,జూన్01.అక్షర టైమ్స్:-** సంక్షేమాన్ని,అభివృద్ధిని సమపాలల్లో ముందుకు తీసుకువెళ్లగలిగిన సత్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే ఉందని ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ టిడిపి పొలిట్ సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. సామాజిక పెన్షన్ల పంపిణీలో భాగంగా గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో ఎమ్మెల్యే నెహ్రూ వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకు ఆయన స్వయంగా వెళ్లి పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ దేశంలోనే పెన్షన్ అధిక మొత్తంలో ఇస్తున్న రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ మాత్రమేనని అన్నారు. ఒకేసారి రూ.4వేలు రూపాయలు పెంచిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందని, అదేవిధంగా రూ. 15 వేలు వరకు చంద్రబాబు నాయుడు పెన్షన్ అందిస్తున్నారని ఇది దేశానికే తలమానికమని నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, మండల కన్వీనర్ పిల్ల చంటిబాబు, జగ్గంపేట మండల కన్వీనర్ జీను మణిబాబు, తిరుమలయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పురంశెట్టి శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి భరత్, భూపతిపురం స్కూల్ చైర్మన్ గళ్ళ రాము, ఉంగరాల గణేష్, దొరబాబు, కోడూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై పశువుల దాణా పంపిణీ..




**పొదలకూరు,జూన్01.అక్షర టైమ్స్:-**రిపోర్టర్ ఆనంద్ : వేసవి కాలంలో పశుగ్రాసం కొరత కారణంగా పశువులకు అవసరమైన పోషకాహారం అందక పాల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం రైతులకు రాయితీపై పశువుల దాణాను అందుబాటులో ఉంచినట్లు ఆల్తుర్తి పశువైద్యాధికారి డాక్టర్ పి. రాధిక తెలిపారు.సోమవారం ఆమె మాట్లాడుతూ, పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగుదలకు సమతుల్య దాణా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యశాల పరిధిలోని వివిధ రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్కేలు) సుమారు 5 టన్నుల పశువుల దాణాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అవసరమైన రైతులు సమీప ఆర్ఎస్కేలను సంప్రదించి దాణాను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

# అడవి రాజుపాలెంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే

- ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో పాల్గొని పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- రచ్చబండ వద్ద ప్రజా దర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి





**కావలి,జూన్01.అక్షర టైమ్స్:-**కావలి మున్సిపాలిటీ పరిధిలోని మద్దూరుపాడు అడవి రాజుపాలెంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొని అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర లబ్ధిదారులను స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్‌కు అర్హత ఉండి ఇంకా మంజూరు కాని వారి వివరాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులతో కలిసి ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని రహదారులు, కాలువలు, డ్రైనేజీలు, చెత్త సేకరణ ప్రాంతాలను పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోంది. అడవి రాజుపాలెంలో పర్యటించి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేయడం ఆనందంగా ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు కొనసాగిస్తున్నాం" అన్నారు.కావలి మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లో మే 22వ తేదీ నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు అన్ని వార్డుల్లో డ్రైనేజీల శుభ్రత, చెత్త తొలగింపు, పారిశుద్ధ్య పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.ఎక్కడైనా పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగకపోతే శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ లేదా ఎమ్మెల్యే కార్యాలయానికి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.పరిశుభ్రత విషయంలో ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి మున్సిపల్ సిబ్బందికి అందించాలని చెప్పారు. చెత్తను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయడం వల్ల పరిసరాలు కలుషితమవడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు."మన ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధిని, మన గ్రామాన్ని కూడా అలాగే శుభ్రంగా ఉంచుకోవాలి.

మున్సిపల్ సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నప్పటికీ ప్రజల సహకారం లేకుండా పూర్తి స్థాయి పరిశుభ్రత సాధ్యం కాదు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను తీసుకుంటే పరిశుభ్రమైన కావలిని నిర్మించగలం. దోమలు లేని,మురుగు సమస్యలులేని,ఆరోగ్యకరమైన కావలిగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం అడవి రాజుపాలెం రచ్చబండ వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తుల నుంచి వినతిపత్రాలు, అర్జీలు స్వీకరించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, మార్గదర్శకత్వంలో కావలి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.కావలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్,పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, ఒకటో వార్డు టిడిపి ఇంచార్జ్ కొండ వెంకట్రావు,వార్డ్ అధ్యక్షుడు పులిమెట్ల వెంకట నారాయణ,పిలిమెట్ల సుబ్రహ్మణ్యం, కొమర వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు గంగిరెడ్డి,వార్డ్ అధ్యక్షుడు పులిమెట్ల వెంకట నారాయణ, పిలిమెట్ల సుబ్రహ్మణ్యం, కొమర వెంకటేశ్వర్లు, చీరల శ్రీనివాసులు, రావినూతల మురళి, అక్కలికుంట జీవ, అక్కిలి గుంట వెంకటేశ్వర్లు, పోతన బోయిన మహేశ్వరరావు, అక్కిలిగుంట యానాది, కడెం నాగార్జున,పిలిమిట్ల వెంకట్రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు,మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతోనే నాలో అంతులేని ఆనందం

- మాలేపాటి రవీంద్ర నాయుడు





**కావలి/దగదర్తి,జూన్01.అక్షర టైమ్స్:-** ప్రజలతో ఉన్నప్పుడే తనలో అంతులేని ఆనందం గుర్తిస్తున్నానని అది నా తండ్రి రామానాయుడు నేర్పిన క్రమమని దగదర్తి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు మాలేపాటి రవీంద్ర నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన జన్మదినం సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన నివాసం చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు దగదర్తిలోని వారి నివాసంలో ఉన్న సంగతితెలిసి అత్యధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు మరియు ప్రజలు చేరుకున్నారు. మాలేపాటి రవీంద్ర నాయుడు జన్మదినం సందర్భంగా పలువురు కేకులు స్వీట్లతో ఆయనను కలిశారు. మరి కొంతమంది శాలువాలతో సత్కరించారు ఇలా వారి అభిమానం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కానీ ఆడంబరాలకు దూరంగా ఉండే వ్యక్తిగా మాలేపాటి రవీంద్రనాయుడు ఇవేమీ వద్దని మీ అభిమానం మాత్రం చాలని, ప్రజలకు సేవ చేయడమే తనకు ఆనందమని అందరికీ తెలియజేస్తూ, ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది.

# శ్రీవారి భక్తులకు మరో శుభవార్త



- 'శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయ స్కీమ్'తో బ్రేక్ దర్శనాలు
- రూ.లక్ష విరాళంతో ఐదుగురు దర్శనం చేసుకునే అవకాశం
- భక్తులకు వసతి, 5 లడ్డూలు అందజేత
- శ్రీవాణి ట్రస్టు దాతల టికెట్లకు విపరీతమైన డిమాండ్ నేపథ్యంలో భక్తులు వీటికి ప్రయత్నించొచ్చు

శ్రీవాణి ట్రస్టు దాతలు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నట్లే, టీటీడీ నిర్వహిస్తున్న మరో పథకమూ అలాంటి భాగ్యమే కల్పిస్తోంది. అదే 'శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయ స్కీమ్'. ఎస్వీ ప్రాణదాన ట్రస్టు అనుబంధంగా ఉన్న ఈ పథకం 2022లోనే అందుబాటులోకి వచ్చింది. ఈ స్కీమ్ కింద భక్తులు తిరుమలలోని ఆదిశేషు అతిథిగృహంలోని కార్యాలయంలో విరాళం అందజేస్తే మర్నాడు శ్రీవాణి ట్రస్టు దాతల దర్శనానికి ముందే వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తారు.

రూ.లక్ష విరాళంతో ఐదుగురు దర్శనం చేసుకోవచ్చు. వసతి, 5 లడ్డూలు ఇస్తారు. రూ.కోటి విరాళం ఇస్తున్న భక్తులకు ఎలాగూ ఉదయాస్తమాన సేవా టికెట్లు ఇస్తున్నారు. అంతకంటే తక్కువ ఇచ్చే భక్తులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో 'ఆపన్న హృదయ స్కీమ్'ను పెట్టారు. వేసవిలో శ్రీవాణి ట్రస్టు దాతల టికెట్లకు విపరీతమైన డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో భక్తులు వీటికి ప్రయత్నించొచ్చు.

మరోవైపు విజయవాడ విమానాశ్రయ కేంద్రంగా తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టు దాతల దర్శన టికెట్ల విక్రయాల జారీకి టీటీడీ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం టీటీడీ రోజుకు 1500 శ్రీవాణి ట్రస్టు దాతల దర్శన టికెట్లను జారీ చేస్తోంది. ఇందులో ఆన్‌లైన్ ద్వారా 500 టికెట్లు, ఆఫ్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా 800 టికెట్లు, తిరుపతి రేణిగుంట విమానాశ్రయంలో 200 టికెట్లను భక్తులకు అందిస్తోంది.

టీటీడీ కీలక నిర్ణయం: రేణిగుంట విమానాశ్రయంలో రోజూ ఉదయం జారీ చేసే 200 టికెట్లను హైదరాబాద్ నుంచి మొదటి విమానంలో వచ్చే భక్తులు కొద్ది నిమిషాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తర్వాత విమానాల్లో వచ్చే వందలాది మంది భక్తులు శ్రీవాణి దర్శన టికెట్లు దొరక్క తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా టీటీడీ కీలక నిర్ణయం తీసుకోనుంది.

మరింత సులభతరం శ్రీవారి దర్శనం : విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో రోజుకు 100 శ్రీవాణి దర్శన టికెట్లను జారీ చేయాలని టీటీడీ యోచిస్తోంది. దీనివల్ల అమరావతి, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి తిరుపతి వచ్చే భక్తులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి.

ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఆమోదం పొందిన వెంటనే విజయవాడలో శ్రీవాణి టికెట్ల కౌంటర్ ప్రారంభించనున్నారు. దీంతో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనం మరింత సులభతరం కానుంది.

ఇదిలా ఉండగా మరోవైపు శ్రీవాణి నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న 5 వేల దేవాలయాలను వచ్చే 2 ఏళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఆలయాల నిర్మాణ పర్యవేక్షణ కోసం రాష్ట్ర స్థాయి కమిటీ వేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల అభివృద్ధికి టెంపుల్ టౌన్ డెవలప్‌మెంట్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేసిన సంగతి తెలిసిందే.

# పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు




**ఒంగోలు,జూన్ 01.అక్షర టైమ్స్:-** రాష్ట్ర ప్రభుత్వ సామాజిక భద్రత కింద వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర పింఛన్ల దారులకు జూన్ నెలలో అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొన్నారు. సోమవారం ఒంగోలు నగరంలోని ఏనుగుల చెట్టు వీధి లో మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ రాజాబాబు, లబ్దిదారులకు పింఛన్ సొమ్ము అందజేసారు. కలెక్టర్ వెంట ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకట క్రిష్ణయ్య, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

# ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజా దర్బార్ సదుద్దేశం

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి





**దొనకొండ,జూన్ 01.అక్షర టైమ్స్:-** మండల కేంద్రమైన దొనకొండలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ లో మండలంలోని రెవెన్యూ, పోలీస్, ఎంపీడీవో, ఎలక్ట్రికల్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్ పలు ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రజల మధ్యకు వెళుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల అవసరాలు తీర్చే లక్ష్యంగా ప్రజాదర్బార్లకు శ్రీకారం చుట్టారన్నారు. అదే స్ఫూర్తితో అధినేతలను అనుసరిస్తూ మన ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించుకునే వేదిక ఈ ప్రజా దర్బార్ అని ఆమె అన్నారు. రెవిన్యూ సమస్యలు, విద్యుత్తు పోల్స్ కావాలని, తీగలు ఎత్తు తక్కువ ఉన్నాయని, కరెంటు లైన్ లు కావాలని సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అదేవిధంగా తాగునీటి సమస్యపై కూడా కొన్ని మొత్తం 50 వినతులు అందాయి అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు వచ్చే ప్రజా దర్బార్ లోపు స్థానికంగా పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించాలని ప్రజలను కార్యాలయాలు చుట్టు తిప్పవద్దని ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేయడమే మన లక్ష్యం అన్నారు. ప్రజలకు జవాబుదారులుగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించాలన్నారు. గత ప్రజా దర్బార్ లో 120 అర్జీలు అందాయని వాటిల్లో 80 శాతం సమస్యలు పరిష్కారం అయ్యాయని అధికారుల కృషి అభినందించారు. అదేవిధంగా ఈ ప్రజాదర్బార్ లో అందిన అర్జీలు కూడా తక్షణమే పరిష్కరించాలని ఆమె కోరారు. త్వరలో ప్రభుత్వం కొత్త పెన్షన్లను కూడా మంజూరు చేస్తుందని ఈ సందర్భంగా ప్రకటించారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, క్లస్టర్ వెంకటేశ్వర్లు, నాగులపాటి శివకోటేశ్వరరావు, దొనకొండ టౌన్ టిడిపి అధ్యక్షులు తోహిద్, మండల ప్రధాన కార్యదర్శి మరియు కామేపల్లి చెంచయ్య, మోడీ వెంకటేశ్వర్లు, రమణ యాదవ్, సుభాని, వెంకట స్వామి, వేంకటాద్రి, మండలం లోని గ్రామ పార్టీ అధ్యక్షులు, యూనిట్ అండ్ బూత్ ఇంచార్జీలు, మండలం లోని వివిద హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


# నూతన వస్త్ర బహుకరణ వేడుకలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి - లలిత్ సాగర్ దంపతులు




**దర్శి,జూన్ 01.అక్షర టైమ్స్:-** దొనకొండ లో టీడీపి నాయకులు మోడీ సుభాకర్ - అంజమ్మ ల కుమార్తె చి॥ వెంకట భాగ్యలక్ష్మీ నూతన వస్త్ర బహుకరణ వేడుకలో సోమవారం దర్శి టీడీపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ - డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దంపతులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, మోడీ వెంకటేశ్వర్లు, కామేపల్లి చెంచయ్య, వెంకట స్వామి మరియు దొనకొండ మండలం లోని వివిద హోదాల్లో ఉన్న టీడీపి నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి పాతూరి కోటేశ్వరరావు చేసిన సేవలు వెలకట్టలేనివి

## డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు



**దర్శి,జూన్ 01.అక్షర టైమ్స్ :** గుంటూరు జిల్లాలో ప్రముఖ విద్యావేత్తలలో ఒకరైన పాతూరి కోటేశ్వరరావు మరణం పట్ల రాష్ట్ర టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, పాతూరి కోటేశ్వరరావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమకు అత్యంత ఆప్తులైన పాతూరి కిరణ్ కుమార్ తండ్రి పాతూరి కోటేశ్వరరావు అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించిన కోటేశ్వరరావు జెకెసి కళాశాలలో హెచ్ఓడీగా, అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారి మరణం గుంటూరు జిల్లా విద్యావ్యవస్థకు, విద్యారంగానికి తీరని లోటని పేర్కొన్న దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి , పాతూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు వారికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని, పాతూరి కోటేశ్వరరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రముఖ విద్యావేత్త పాతూరి కోటేశ్వరరావు పల్నాడు జిల్లా, ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు లో ఓ రైతు కుటుంబం లో జన్మించిన పాతూరి కోటేశ్వరరావు ఉన్నత విద్యను అభ్యసించి గుంటూరు జేకేసి కళాశాలలో లెక్చరర్ గా జీవితం ప్రారంభించి అదే కాలేజి లో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ గా పని చేశారు. అనంతరం తెలుగు రాష్టాలలో పేరొందిన విజ్ఞాన్ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా కూడా పని చేసి విజ్ఞాన్ విద్యా సంస్థల అభివృద్ధి లో తన వంతు కృషి చేశారు. గురువు గా పాతూరి కోటేశ్వరరావు ఎంతో మంది ప్రయోజకులను సమాజానికి అందించారు. పాతూరి కోటేశ్వరరావు కు కొడుకు డాక్టర్ కిరణ్ , కూతురు రాధీక లు ఉన్నారు. పాతూరి కోటేశ్వరరావు గుంటూరు విద్యా నగర్ లోని తన నివాసం లో సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు. పాతూరి కోటేశ్వరరావు మృతి పట్ల పలువురు విద్యా, వైద్య , వ్యాపార, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. పాతూరి పార్థివదేహానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర, భాష్యం విద్యా సంస్థలు అధినేత బాష్యం రామకృష్ణ, పలువురు టిడిపి నేతలు పాతూరి కి నివాళ్లు అర్పించి అంత్యక్రియలలో పాల్గొన్నారు.

# నీటి మీద నిరంతర పర్యవేక్షణ అవసరం: జిల్లా కలెక్టర్ పి రాజాబాబు




**జె.పంగులూరు/ఒంగోలు,జూన్ 01.అక్షర టైమ్స్:-** నాగార్జునసాగర్ నుంచి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించుకునేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చెప్పారు. సోమవారం ఆయన జె.పంగులూరు మండలంలోని రామకూరు గ్రామంలో నాగార్జునసాగర్ నుంచి వస్తున్న కాలువను పరిశీలించారు. ఎగువ నుంచి వస్తున్న నీటి పరిమాణము, ప్రవాహ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్రాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గంలోని అన్ని చెరువులను పూర్తిస్థాయి నింపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ఉండాలని, పొరుగు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలోకి వస్తున్న నీటి పరిమాణం, చెరువులను నింపుతున్న వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఈ.ఈ.సతీష్, ఇతర అధికారులు ఉన్నారు.

# దోమల నియంత్రణ - మలేరియా నివారణ



## జూన్ 1 నుండి జూన్ 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు




**ఒంగోలు,జూన్ 01.అక్షర టైమ్స్:- (బ్యూరో, షేక్. కరిముల్లా)** : ప్రజాదర్బార్ హాలు నందు సోమవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ పి. రాజాబాబు ఆదేశముల మేరకు జిల్లా లో జరుగుచున్న మలేరియా వ్యతిరేకమాసచవం గోడ పత్రికను ఆవిష్కరించారు. మాసోత్స్యములు గురించి మాట్లాడుతూ మలేరియా లక్షణాలు సాధారణంగా దోమ కాటు తర్వాత 7 నుండి 15 రోజుల తర్వాత ప్రారంభమవుతాయి, మలేరియా యొక్క లక్షణాలు , మలేరియా యొక్క అత్యంత గుర్తించదగిన లక్షణం జ్వరం, ఇది తరచుగా చలి మరియు చెమటతో కూడిన విలక్షణమైన 'మలేరియా ప్యారొక్సిస్మ్' లేదా 'ఫీవర్ పీరియడ్స్' ద్వారా వర్గీకరించబడుతుంది. ఈ దశలను ఈ క్రింద క్లుప్తంగా వివరించడం జరిగింది. చలి దశ మొదట, వ్యక్తి తీవ్రమైన చలి మరియు వణుకుతో బాధపడతాడు, ఈ దశ 15 నిమిషాల నుండి ఒక గంట వరకు ఉంటుంది. ప్రతి సంవత్సరం జూన్ నెలను మలేరియా వ్యతిరేక మాసోత్సవాలుగా నిర్వహిస్తారు. వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో దోమల పెరుగుదల ఎక్కువగా ఉండటం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. మలేరియా అంటే ఏమిటి మలేరియా అనేది సోకిన ఆడ అనోఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపించే వ్యాధి. ఇది జ్వరం, వణుకు, తలనొప్పి, చెమటలు, నీరసం వంటి లక్షణాలను కలిగిస్తుంది. మలేరియా లక్షణాలు తరచుగా జ్వరం రావడం వణుకుతో కూడిన జ్వరం తలనొప్పి ఒళ్లునొప్పులు అధిక చెమటలు బలహీనత, నీరసం మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి. నీరు నిల్వ ఉండకుండా చూడండి. నీటి ట్యాంకులు, డ్రమ్‌లు, బకెట్లను తపెట్టండి. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పగిలిన పాత్రలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా తొలగించండి. రాత్రి సమయంలో దోమతెరలను ఉపయోగించండి. పూర్తి చేతుల దుస్తులు ధరించండి. కిటికీలు, తలుపులకు దోమ జాలర్లు(మెష్ )ఏర్పాటు చేసుకోండి. అవసరమైతే దోమల నివారణ మందులు, రిపెలెంట్లు ఉపయోగించండి. జ్వరం వచ్చినప్పుడు ఏమి చేయాలి జ్వరాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే ఆశా కార్యకర్త, ఏఎన్‌ఎం లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించండి. రక్త పరీక్ష చేయించుకోండి. సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చికిత్స పొందండి. వైద్యుల సూచనలు పూర్తిగా పాటించండి. మన బాధ్యత - మన ఆరోగ్యం"ప్రతి శుక్రవారం - డ్రై డే పాటిద్దాం" ఇంటి చుట్టూ, పైకప్పులపై, కూలర్లలో, పూల కుండీలలో నిల్వ నీటిని తొలగిద్దాం. ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నిర్మూలన సాధ్యం. దోమల పెరుగుదలను అరికడదాం - మలేరియాను నివారిద్దాం, ఆరోగ్యకరమైన కుటుంబం - సురక్షితమైన సమాజం జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాహాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు , జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు, సబ్ యూనిట్ ఆఫీసర్స్ పాతూరి శ్రీనివాసులు, సాగర్, అర్జునరావు, హెల్త్ అసిస్టెంట్స్, పాల్గొన్నారు.

# కంభం మండల విద్యాశాఖాధికారి - 2 గా పత్తి. శ్రీనివాసులు



**కంభం,జూన్ 01.అక్షర టైమ్స్:-** మార్కాపురం జిల్లా, కంభం మండల విద్యాశాఖ అధికారి - 2 గా పత్తి శ్రీనివాసులు నియమితులయ్యారు. మండల విద్యాశాఖ అధికారిగా నియమితులైన పత్తి శ్రీనివాసులుకి వివిధ ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలియజేశారు.

# 2025 డిఎస్సి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి




**ఒంగోలు,జూన్ 01.అక్షర టైమ్స్::** ప్రకాశం జిల్లా, ఒంగోలు లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో డీఎస్సీ 2025 జరిగిన అక్రమాల పై సిట్టింగ్ జడ్జి లేదా సిబిఐ తో విచారణ జరిపించాలని అంబేద్కర్ విగ్రహం వద్ద ఒంగోలు పార్లమెంట్ పరుశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి బొట్ల రామారావు , రాష్ట్ర మహిళా కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ, ప్రకాశం జిల్లా వైస్సార్సీపీ యూత్ వింగ్ అధ్యక్షులు అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి , ప్రచార విభాగం అధ్యక్షులు శేషారెడ్డి , మహిళా విభాగం అధ్యక్షులు దుంపా రవణమ్మ , బిసి సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి అధికారులకు ఆదేశించిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు






**ఒంగోలు,జూన్ 01.అక్షర టైమ్స్:-(బ్యూరో, షేక్. కరిముల్లా) :** ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల వ్రాతపూర్వక వినతులను జిల్లా ఎస్పీ మరియు పోలీస్ అధికారులు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదులకు సంబంధించి ఫిర్యాదుదారుల వివరాలను ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, తక్షణమే విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందించేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులో వాటిని పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రతి ఒక్కరికి పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరిగేలా స్పందించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు మరియు ఇతర ప్రత్యేక అవసరాలు ఉన్న ఫిర్యాదుదారుల పట్ల సున్నితంగా వ్యవహరించి, వారి వినతులను ప్రాధాన్యతతో పరిశీలించి, చట్టపరమైన పరిధిలో త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్/భూ/ఆర్థిక తగాదాలు, అత్తరింటి వేదింపులు, మోసాలు, చీటింగ్ మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హాజరత్తయ్య, కందుకూరు సీఐ అన్వర్ బాషా, అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు,



ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పేద పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలన్నదే

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం

### అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సంక్షేమం అందిస్తున్నాంలి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి







**ఒంగోలు,జూన్ 01.అక్షర టైమ్స్ :** పేదల పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ఒంగోలులోని సంతపేటలో రూ. 6 కోట్లతో నిర్మిస్తున్న ఎస్సి గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు మంత్రి డిఎస్ బీవీ స్వామి పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని మంత్రి అధికారులకు సూచించారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం అజయ్ కింద రూ. 86 కోట్లతో రాష్ట్రంలో 25 నూతన హాస్టళ్లు నిర్మిస్తున్నాం. సాస్కి నిధులు రూ. 200 కోట్లతో రాష్ట్రంలోని హాస్టళ్లకు మరమ్మతులు, అదనపు భవనాలు నిర్మిస్తున్నాం. రూ.143 కోట్లతో 700 హాస్టళ్లకి మరమ్మతులు చేశాం. రూ. 58 కోట్లతో అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అదనపు మరుగుదొడ్లు నిర్మించాం. ఒంగోలులో దివ్యాంగ విద్యార్థుల కోసం రూ.3 కోట్లతో ప్రత్యేకంగా హాస్టల్ నిర్మిస్తున్నాం. త్వరలోనే మెస్ చార్జీలు పెంచుతాం. తిరుపతి, విజయవాడ, విశాఖ స్టడీ సర్కిళ్లలో 450 మందికి ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇస్తున్నాం. వీటితో పాటు ఒంగోలు, అమలాపురంలో నూతనంగా స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తాం. 250 మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టాం. పేదల పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు అవ్వాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం. అందుకనుగుణంగా ఐఐటి, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లను 3 నుంచి 13 కి పెంచాం. మరో 12 పెంచి 25 జిల్లాలకు 25 ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# డాక్టర్ గైర్హాజర్ - గొట్టిపాటి లక్ష్మీ సీరియస్









**దొనకొండ,జూన్ 01.అక్షర టైమ్స్:-** దొనకొండ మండల కేంద్రమైన దొనకొండలో గల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ డాక్టర్ బయటికి వెళ్లిపోవడం, ఇద్దరు డాక్టర్లు ఉండవలసిన వైద్య శాలలో ఒక్క డాక్టర్ మాత్రమే అక్కడ ఉండటం గుర్తించారు. డాక్టర్ గైర్హాజర్ అవ్వటం పై ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇలా నిర్లక్ష్యంగా సోమవారం రోగులను చూడకుండా డాక్టర్ వెళ్లిపోవడంపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయాల్సిన డ్యూటీ డాక్టర్లు గైర్హాజరవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ఉన్న డాక్టరు ఇతర సిబ్బంది నిర్లక్ష్యంపై కూడా ఆమె త్రీవరంగా మండిపడ్డారు. వైద్య శాలలో లోని ఓ పి విభాగం, ల్యాబ్, వసతులు పై క్షుణ్ణం గా పరిశీలించి మళ్లీ ఒక వారం లో విజిట్ చేస్తాను అని తెలియజేశారు. గత ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రి పోస్టర్ ఇంకా కొనసాగడం పట్ల ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారి రెండేళ్లు అయినా ఎందుకు మీరు గత ముఖ్యమంత్రితో ఉన్న పోస్టర్ను తొలగించలేదని ఆమె ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఫోటోలు ఎందుకు పెట్టలేదని సిబ్బందిపై మండిపడ్డారు. మరిన్ని వసతుల మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని డాక్టర్ లక్ష్మి హామీ ఇచ్చారు. దొనకొండ ప్రభుత్వ వైద్య శాల పరిస్థితులను చక్కదిద్దేందుకు జిల్లా కలెక్టర్ కి సమగ్రంగా నివేదిస్తామని డాక్టర్ లక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు.

# రాచర్ల లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే







**రాచర్ల,జూన్ 01.అక్షర టైమ్స్:-** : గిద్దలూరు నియోజకవర్గం, రాచర్ల గ్రామంలోఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొన్నారు. రాచర్లలోని ఒక వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి తనే పెన్షన్ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ప్రతి నెలలో ఒకటో తారీకు ని ఖచ్చితంగా ప్రతి ఇంటి ఇంటికి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఒక సంవత్సరానికి 33 ,000 వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టి పెన్షన్ ఇవ్వడం జరగడం లేదని ఒక్క మన ఆంధ్రప్రదేశ్లో మాత్రమే కూటమి ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఈ సమయంలో గోళ్లు కత్తిరిస్తున్నారా..? అయితే ఇది మీకోసమే..!



మన ఇంట్లో పెద్దవాళ్లు తరచూ చెప్పే మాట.. రాత్రిపూట గోళ్లు కత్తిరించవద్దని.. ఇది ఒక సాధారణ సూచనలా అనిపించినా.. దీని వెనుక ఉన్న కారణాలు శాస్త్రం, ఆరోగ్యం, సంప్రదాయ విశ్వాసాలతో చాలా అనుబంధం కలిగి ఉంటాయి. ఈ అలవాటు ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోవాలి. పురాతన నమ్మకాల ప్రకారం రాత్రిపూట కొన్ని చెడు శక్తులు ఎక్కువగా తిరుగుతాయట. ఆ సమయంలో గోళ్లు కత్తిరిస్తే ఆ శక్తులు మనకు కష్టాలు కలిగిస్తాయని అనుకునేవారు. కొందరు రాత్రిపూట చంద్రుడి శక్తి చాలా ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు. గోళ్లు తీసేస్తే ఆ శక్తి తగ్గిపోతుందని కూడా భావించేవారు. శాస్త్రంలో కూడా రాత్రిపూట గోళ్లు కత్తిరించడం వల్ల శరీరం సమతుల్యత దెబ్బతింటుందని చెబుతారు. విద్యుత్ అందుబాటులో లేని రోజులలో రాత్రిపూట వెలుతురు చాలా తక్కువగా ఉండేది. అప్పుడు దీపాల వెలుతురులో గోళ్లు కత్తిరించడం ప్రమాదకరం. ఒక్కసారి తప్పుగా కత్తిరిస్తే వేళ్లకు గాయం అయ్యే అవకాశం ఉండేది. అందుకే రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదని చెప్పారు. ఇది పూర్తిగా భద్రతతో సంబంధం ఉన్న విషయం. సాయంత్రం అయ్యాక మన శరీరం నిద్రపోవడానికి తయారవుతుంది. రోజంతా పని చేసి అలిసిపోయిన శరీరం అప్పుడు రెస్ట్ తీసుకోవాలనుకుంటుంది. అలాంటి టైమ్లో పదునైన వస్తువులు పట్టుకోవడం, జాగ్రత్తగా చేయాల్సిన పనులు చేయడం మంచిది కాదు. గోళ్లు కత్తిరించడం అంటే చాలా శ్రద్ధగా చేయాల్సిన పని. అలసటగా ఉన్నప్పుడు సరిగ్గా చేయకపోతే ప్రమాదం జరిగే ఛాన్స్ ఉంది. గోళ్లు కత్తిరించినప్పుడు చిన్న చిన్న ముక్కలు కింద పడతాయి. వాటికి బ్యాక్టీరియా లేదా దుమ్ము అంటుకుని ఉండొచ్చు. పగటిపూట లైట్ లో అవి బాగా కనిపిస్తాయి కాబట్టి వాటిని తీసి పారేయొచ్చు. కానీ రాత్రిపూట మంచం మీద కూర్చొని గోళ్లు కత్తిరిస్తే అవి అక్కడే పడిపోతాయి. పొరపాటున అవి మనం తినే ఆహారంలో కలిసిపోయే ఛాన్స్ ఉంది. అలా జరిగితే ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాదు ఆ గోళ్ల ముక్కలకు చీమలు, చిన్న పురుగులు కూడా వస్తాయి. రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదనే సలహా కేవలం మూఢనమ్మకం కాదు. దీనివెనుక భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, శారీరక స్థితి అన్నీ మిళితమై ఉన్నాయి. పగటిపూట వెలుతురులో గోళు కత్తిరించడం వల్ల గాయాల ప్రమాదం తగ్గుతుంది. అదనంగా పరిశుభ్రంగా ఉండే అవకాశం కూడా ఎక్కువ. నేలపై కాగితం లేదా బట్టను పరచి ఆపై కత్తిరిస్తే గోళ్లు ఒక్కచోటే చేరుతాయి. మన పెద్దల సూచనను నిర్లక్ష్యం చేయకుండా వెలుతురు ఉన్న సమయంలో గోళ్లు కత్తిరించటం మంచి అలవాటు.

## జుట్టు రాలడం ఆగాలంటే ఈ నీళ్లు తాగాల్సిందే..! ఇది మంచి టానిక్ లా పని చేస్తుంది..!



ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా మెరిసే జుట్టు కావాలని ఉంటుంది. ఈ రోజుల్లో జుట్టు రాలడం, పెరగకపోవడం, బలహీనత వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సహజమైన మునగ ఆకుల నీరు బాగా ఉపయోగపడుతుంది. దీన్ని తాగడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. మునగ ఆకులు విటమిన్ %ూా, జ, జు, దీ% లను అందిస్తాయి. ఇందులో ఐరన్, జింక్, అమైనో ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి అన్ని కలిసి జుట్టు మూలాలను బలంగా మార్చడంలో సహాయపడతాయి. ఆకులలో ఉండే పోషకాలు జుట్టు ఎదుగుదలకు అవసరమైన సహజ మార్గం అందిస్తాయి. మునగ గింజలు కూడా శక్తివంతంగా పనిచేస్తాయి. మునగ ఆకుల నీటిని తాగడం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. తల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు బలంగా, మెత్తగా, ప్రకాశవంతంగా మారుతుంది. తలలో కొత్త జుట్టు మొదలవుతుంది. ఇది సాధారణంగా రసాయనాలు వాడకుండా చక్కగా పెరిగే సహజ మార్గం. గుప్పెడు తాజా మునగ ఆకులను తీసుకొని శుభ్రంగా కడగాలి. వీటిలో ఉండే మురికి తొలగించాలి. తరువాత రెండు కప్పుల నీటిని మరిగించాలి. నీరు మరిగిన తర్వాత అందులో ఆకులను వేసి 10 నిమిషాలు ఇంకా మరిగించాలి. తరువాత వడకట్టి నీరు చల్లార్చి తాగాలి. దీనిని ఖాళీ కడుపుతో తీసుకుంటే బాగా పని చేస్తుంది. మునగకాయలను చిన్న ముక్కలుగా రెండు కట్ చేసుకోవాలి. ఇప్పుడు రెండు కప్పుల నీటిని మరిగించి అందులో ఈ ముక్కలు వేసి 10 నిమిషాలు మరిగించాలి. తరువాత వడకట్టి చల్లబర్చాలి తాగాలి. ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి. ఒక కప్పుతో మొదలుపెట్టి, క్రమంగా రెండు కప్పుల వరకు తీసుకోవచ్చు. రుచి సరిగా అనిపించకపోతే తేనె లేదా నిమ్మరసం కొద్దిగా వేసుకోవచ్చు. దీన్ని వారంలో మూడుసార్లు తాగినా సరిపోతుంది. క్రమంగా రెండు నెలలు తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మునగ నీటిని తాగడమే కాకుండా.. తల కడుక్కోవడానికి కూడా వాడొచ్చు. తలపై ఈ నీటిని పోస్తే తల చర్మం చల్లగా ఉంటుంది. దీంతో తలలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. జుట్టు బలంగా మారుతుంది. మునగ నీటిలో విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలో ఉన్న విషాలను బయటకు పంపుతుంది. చర్మానికి మెరుపు తీసుకువస్తుంది. జుట్టు ఎదుగుదల క్రమంగా మెరుగవుతుంది.

## ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టొచ్చు..!



అరటి పండు తిన్నాక మిగిలే తొక్కను చాలా మంది వ్యర్థంగా వదిలేస్తారు. కానీ అది జుట్టు సంరక్షణలో అద్భుత ఫలితాలు ఇస్తుంది. సహజంగా దొరికే ఈ తొక్కను సరైన రీతిలో వాడితే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. తల చర్మానికి పోషణ ఇస్తూ కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. అరటి పండు తిన్నాక మిగిలిపోయే తొక్కను చాలా మంది విసిరేస్తారు. కానీ అదే తొక్క జుట్టుకు అద్భుతంగా పనిచేస్తుంది. సరైన రీతిలో వాడితే ఇది జుట్టు రాలడాన్ని తగ్గించటమే కాకుండా కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. ఆరోగ్యంగా జుట్టు పెరగాలంటే దీన్ని ఉపయోగించడం మంచిది.

**అరటి తొక్కలో చాలా పోషకాలు**

పొటాషియం.. ఇది తలపై తేమను నిలుపుతుంది. తల చర్మం పొడి కాకుండా ఉండేలా చూస్తుంది.

**మెగ్నీషియం.. ఇది తల చర్మంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది.**

విటమిన్ ఇవి జుట్టు ఫోలికల్స్ కు బలం ఇస్తాయి.

ఇవి జుట్టు రాలే సమస్య తగ్గించడంలో సహాయపడతాయి.

**హెయిర్ మాస్క్**

పండిన అరటి తొక్క 1, కొబ్బరి నూనె 1 టీస్పూన్, తేనె 1 టీస్పూన్. ఈ మూడు పదార్థాలను బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి 30 నిమిషాలు ఉంచాలి. తర్వాత తల శుభ్రంగా కడగాలి. ఇది తలకు పోషణ అందించి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

**అరటి తొక్క వాటర్ వాష్**

అరటి తొక్క 1, నీరు 2 కప్పులు. అరటి తొక్కను నీటిలో 10 నిమిషాలు మరిగించాలి. చల్లారిన తర్వాత ద్రవాన్ని వడకట్టాలి. ఈ నీటిని చల్లార్చి తల కడిగిన తర్వాత చివరిగా తలపై పోయాలి. ఇది తల చర్మాన్ని తేమగా ఉంచుతుంది. జుట్టు మెత్తగా మారుతుంది.

**అరటి తొక్కతో ఆయిల్**

అరటి తొక్క 1, కొబ్బరి లేదా ఆలివ్ నూనె అర కప్పు. ఒక చిన్న పాత్రలో నూనె వేడి చేయాలి. అందులో తొక్క వేసి 10 నిమిషాలు మరిగించాలి. మరిగిన తరువాత వడకట్టి ఒక సీసాలో నిల్వ చేయాలి. ఈ నూనెను తలకు అప్లై చేసి అరగంట తర్వాత తల కడిగితే జుట్టు కాంతివంతంగా మారుతుంది. మీ తల చర్మం సున్నితంగా ఉంటే.. ఈ నూనెను మొదట కొద్దిగా పరీక్షించి చూడటం మంచిది. ఈ నూనెను ఉపయోగించే ముందు చల్లబరచాలి. సాధారణంగా వారానికి ఒక్కసారి ఈ నూనెను వాడితే సరిపోతుంది. అంతకంటే ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం లేదు. కేవలం అరటి తొక్కతో ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దీనిలో రసాయనాలు లేవు, సైడ్ ఎఫెక్ట్లు కూడా ఉండవు. కొద్దికాలం పాటు క్రమంగా వాడితే జుట్టులో మంచి మార్పు కనిపిస్తుంది. ఈ పదార్థాలు సహజమైనవే అయినా..

# కొత్త రూల్స్ సిలిండర్లలో మారిన ఈ నియమాలు మీకు తెలుసా?

## మనం ప్రతిరోజూ వాడే మొబైల్ పేమెంట్లు



ఇంట్లో వాడే గ్యాస్ సిలిండర్‌విషయంలో జూన్ 1 నుంచి కొన్ని కీలక మార్పులు వచ్చాయి. ఈ కొత్త నిబంధనలు మన రోజువారీ ఖర్చులు, ఆర్థిక లావాదేవీలపై గట్టి ప్రభావం చూపించనున్నాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తడంతో, దేశంలో గ్యాస్ ధరల తో పాటు పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, బ్యాంకులు తీసుకొచ్చిన ఆ కొత్త రూల్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.యూపీఐ లో భారీ మార్పులు..ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరికొత్త సెక్యూరిటీ రూల్స్ తీసుకొచ్చింది. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం లాంటి యాప్స్ ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు పంపేటప్పుడు ఇకపై కేవలం 4 లేదా 6 అంకెల పిన్ నెంబర్ నొక్కితే సరిపోదు.బయోమెట్రిక్ వెరిఫికేషన్: పెద్ద మొత్తంలో లావాదేవీలు చేసేటప్పుడు కచ్చితంగా మీ ఫేస్ ఐడీ లేదా ఫింగర్‌ప్రింట్ (దీఅశివవీతీఅఎ) వెరిఫై చేయాల్సి ఉంటుంది.పేరు చూపిస్తుంది: పొరపాటున వేరే వాళ్లకు డబ్బులు పంపకుండా ఉండటానికి, మీరు స్కాన్ చేయగానే సదరు వ్యక్తి ఒరిజినల్ అఫీషియల్ పేరు స్క్రీన్‌పై స్పష్టంగా కనిపిస్తుంది.ఏటీఎం విత్‌డ్రా లిమిట్: కార్డు లేకుండా యూపీఐ ద్వారా ఏటీఎం నుండి డబ్బులు తీస్తే, వాటిని కూడా మీ నెలవారీ ఉచిత విత్‌డ్రాయల్స్ లిమిట్ కిందే లెక్కిస్తారు. లిమిట్ దాటితే ఛార్జీలు పడతాయి.**గ్యాస్ సిలిండర్ కొత్త రూల్స్ ఇవే!**ప్రభుత్వం ఇప్పుడు ఎల్‌పీజీ సిలిండర్ల నుండి పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ల వైపు జనాలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కొన్ని కఠినమైన నిబంధనలు అమలులోకి వచ్చాయి.పీఎన్‌జీ కనెక్షన్ రూల్: మీకు కొత్తగా పీఎన్‌జీ కనెక్షన్ వస్తే, కేవలం 30 రోజుల్లోగా మీ పాత ఎల్‌పీజీ కనెక్షన్‌ను రద్దు చేసుకోవాలి. ఒకే ఇంట్లో పీఎన్‌జీ, ఎల్‌పీజీ రెండు ఉంచుకోవడం కుదరదు.కొత్త బుకింగ్స్‌పై నిషేధం: ఇప్పటికే ఇంట్లో పీఎన్‌జీ వాడుతున్న వారు, కొత్తగా ఎల్‌పీజీ కనెక్షన్ తీసుకోవడానికి వీల్లేదు.సిలిండర్ బుకింగ్ గ్యాప్: గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుక్ చేయడానికి ఒక ఆర్డర్‌కు, మరో ఆర్డర్‌కు మధ్య ఉండాల్సిన సమయాన్ని మార్చారు. పట్టణాల్లో ఈ గ్యాప్ 25 రోజులు, పల్లెటూళ్లలో 45 రోజులుగా నిర్ణయించారు.ఒక ఇంటికి ఒకే కనెక్షన్: ఒకే ఇంట్లో ఎక్కువ సిలిండర్లు దాచిపెట్టకుండా ఉండటానికి "వన్ హౌస్.. వన్ కనెక్షన్" రూల్‌ను కఠినంగా అమలు చేస్తున్నారు.**జూన్ 1 నుంచే ఎందుకు?**సాధారణంగా మే 31 నాటికి సాంకేతిక మార్పుల గడువు ముగుస్తుంది. అలాగే జూన్ నెలలో స్కూల్ ఫీజులు, సమ్మర్ హాలిడేస్ ప్రయాణాల వల్ల ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్ విపరీతంగా పెరుగుతాయి. అందుకే ఎలాంటి ఇబ్బందులు రాకుండా జూన్ 1 నుంచే ఈ కొత్త సెక్యూరిటీ సిస్టమ్స్ అమల్లోకి తెచ్చారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో గ్యాస్ ధరలు పెరుగుతున్న వేళ, ఈ రూల్స్ తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం.

# కాల్పుల విరమణపై ఇరాన్ కీలక నిర్ణయం

## ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించిన టెహ్రాన్..అమెరికా యుద్ధ విమానం కూల్చివేత

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. అమెరికా - ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు విఫలం కావడమే కాకుండా, క్షేత్రస్థాయిలో సైనిక ఘర్షణలు మొదలైనట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం.. ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దేందుకు అమెరికా ప్రతిపాదించిన 48 గంటల కాల్పుల విరమణను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.అమెరికా తన ప్రతిపాదనను ఒక అజ్ఞాత మూడవ దేశం ద్వారా బుధవారం నాడు ఇరాన్‌కు పంపినట్లు సమాచారం. అయితే, టెహ్రాన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించడం ద్వారా తన పట్టుదలను ప్రదర్శించింది. ఇరాన్ యొక్క పాక్షిక అధికారిక సంస్థ 'ఫార్స్ న్యూస్' ఈ విషయాన్ని ధృవీకరించగా.. అల్ జజీరా వంటి అంతర్జాతీయ సంస్థలు దీనిని ప్రముఖంగా ప్రచురించాయి. మధ్యవర్తిత్వం వహించిన దేశం పేరు బయటకు రానప్పటికీ, చర్చల ద్వారా శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు ప్రస్తుతానికి నిలిచిపోయాయని స్పష్టమవుతోంది.ఈ ఉద్రిక్తతల నడుమ ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఇరాన్ గగనతలంపై అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్ కూల్చివేయబడింది. బ్రిటన్‌లోని ఆర్ఏఎఫ్ లేకెన్‌హీత్ స్థావరానికి చెందిన ఈ విమానాన్ని ఇరాన్ దళాలు కూల్చివేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ రకమైన విమానంలో సాధారణంగా ఇద్దరు సిబ్బంది (పైలట్, ఆయుధ వ్యవస్థల అధికారి) ఉంటారు.ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..సిఎన్ఎన్ నివేదిక ప్రకారం.. కూలిపోయిన విమానంలోని ఒక సిబ్బంది సభ్యుడిని అమెరికా సైన్యం సురక్షితంగా రక్షించింది. ప్రస్తుతం అతను అమెరికా రక్షణలో చికిత్స పొందుతున్నాడు. అయితే, రెండో సిబ్బంది సభ్యుడి పరిస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు. టెహ్రాన్ నుండి సుమారు 470 కిలోమీటర్ల



దూరంలో ఉన్న ఖుజెస్తాన్ ప్రావిన్స్‌లోని కరూన్ నది సమీపంలో ఈ విమానం కూలిపోయింది. ఇరాన్ మీడియా ఈ ఘటనకు సంబంధించిన శకలాల ఫోటోలను, వీడియోలను విడుదల చేసింది. అందులో హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ఎగురుతూ గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.ఈ ఘటనపై అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) లేదా వైట్ హౌస్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇరాన్ గగనతలంపై ఒక అమెరికా యుద్ధ విమానం కూల్చివేయబడటం ఇదే మొదటిసారి అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య నేరుగా యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ఒకవైపు చమురు ధరలు పెరుగుతుండటం, మరోవైపు ఇలాంటి సైనిక ఘర్షణలు చోటుచేసుకోవడం ప్రపంచ మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి. ఏప్రిల్ నెల గడిచే కొద్దీ ఈ ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయోనన్న భయం పెట్టుబడిదారులలో వ్యక్తమవుతోంది.

# కొత్త లేబర్ కోడ్స్.. గ్రాట్యుటీ అర్హతలో భారీ మార్పులు

## 5 ఏళ్లకు బదులుగా ఏడాదికే





భారతదేశంలో కార్మిక సంక్షేమ దిశగా ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అడుగు వేసింది. నవంబర్ 2025లో అమలులోకి వచ్చిన కొత్త కార్మిక చట్టాలు గ్రాట్యుటీ నిబంధనలలో సమూల మార్పులను తీసుకువచ్చాయి. గతంలో ఒక ఉద్యోగి గ్రాట్యుటీ పొందాలంటే కనీసం ఐదేళ్ల నిరంతర సేవ తప్పనిసరిగా ఉండాలి అనే నిబంధన ఉండేది, కానీ కొత్త మార్పుల ప్రకారం ఇప్పుడు కేవలం ఒక సంవత్సరం తర్వాతే ఈ ప్రయోజనాన్ని పొందే అవకాశం కలిగింది.సాధారణంగా గ్రాట్యుటీ అనేది ఒక ఉద్యోగి ఒక సంస్థకు అందించిన దీర్ఘకాలిక సేవలకు గుర్తింపుగా, పదవీ విరమణ సమయంలో లేదా ఉద్యోగం వదిలివేసేటప్పుడు యజమాని ఇచ్చే ఆర్థిక బహుమతి. చట్టం ప్రకారం, పది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న ప్రతి సంస్థ తన అర్హులైన ఉద్యోగులకు ఈ మొత్తాన్ని చెల్లించడం తప్పనిసరి.ఈ కొత్త నిబంధనలు నవంబర్ 21, 2025 నుండి అధికారికంగా అమలులోకి వచ్చాయి. ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టం చేసిన ప్రకారం, ఈ తేదీ తర్వాత కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులకు మాత్రమే ఒక సంవత్సరం నిబంధన వర్తిస్తుంది. అయితే, ఈ ఒక సంవత్సరం గ్రాట్యుటీ సౌకర్యం ఉద్యోగులందరికీ ఒకేలా వర్తించదు. ప్రధానంగా నిర్ణీత కాలం పని చేసేవారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఈ మార్పు పెద్ద ఊరటనిస్తుంది.ఒక రాతపూర్వక ఒప్పందం ప్రకారం నిర్దిష్ట కాలం పాటు పనిచేసే వీరికి, వారు పనిచేసిన కాలానికి అనుగుణంగా అంటే దామాషా పద్ధతిలో గ్రాట్యుటీని లెక్కిస్తారు. కానీ, రెగ్యులర్ లేదా శాశ్వత ఉద్యోగులు గ్రాట్యుటీ క్లెయిమ్ చేయాలంటే ఇప్పటికీ సాధారణంగా ఐదేళ్ల సేవ పూర్తి చేయాల్సి ఉంటుంది. కేవలం ఉద్యోగి మరణించినా లేదా వైకల్యానికి గురైనా మాత్రమే ఈ ఐదేళ్ల నిబంధన నుండి మినహాయింపు ఉంటుంది. గ్రాట్యుటీ రూల్స్‌లో బిగ్ చేంజ్.. ఏడాది సర్వీస్‌కే డబ్బులు.. కానీ, ఆ కండిషన్ తప్పనిసరి! గ్రాట్యుటీ రూల్స్‌లో బిగ్ చేంజ్.. ఏడాది సర్వీస్‌కే డబ్బులు.. కానీ, ఆ కండిషన్ తప్పనిసరి!గ్రాట్యుటీ లెక్కింపు విధానంలో కూడా ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. కొత్త చట్టం ప్రకారం.. గ్రాట్యుటీ అనేది ఉద్యోగి యొక్క 'వేతనం'పై ఆధారపడి ఉంటుంది. ఇక్కడ వేతనం అంటే కేవలం బేసిక్ పే మాత్రమే కాకుండా, మూల వేతనం, కరువు భత్యం , రిటైనింగ్ అలవెన్స్‌ల కలయికగా పరిగణిస్తారు. ముఖ్యంగా, ఒక ఉద్యోగి యొక్క మొత్తం జీతం లో ఈ వేతనం కనీసం 50 శాతం ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.దీనివల్ల గతంలో తక్కువ బేసిక్ పే ఉండి, ఇతర భత్యాలు ఎక్కువగా పొందిన ఉద్యోగులకు ఇప్పుడు అందే మొత్తం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ సంస్కరణలు లక్షలాది మంది అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతను కల్పించడమే కాకుండా, వారి పదవీ విరమణానంతర జీవితానికి ఆర్థిక భరోసానిస్తాయి.

# భారత్ ఒక ఏడాది పాటు బంగారం కొనడం ఆపేస్తే ఏం జరుగుతుంది



కేంద్రం అసలు ప్లాన్ ఇదే! మన భారతీయులకు బంగారం అంటే కేవలం ఒక లోహం మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్. పెళ్లిళ్లయినా, పండుగలైనా బంగారం కొననిదే మనకు ముచ్చట తీరదు. అయితే, ఒకవేళ భారత్ ఒక సంవత్సరం పాటు విదేశాల నుంచి బంగారం దిగుమతి చేసుకోవడం పూర్తిగా ఆపేస్తే ఏం జరుగుతుందో ఎప్పుడైనా ఆలోచించారా? దీనివల్ల ప్రపంచ మార్కెట్ నుంచి మన ఇంటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రపంచ మార్కెట్లో పసిడి ధరల పతనం? భారత్ ఏటా దాదాపు 800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటుంది. అంటే ప్రపంచంలోనే అతిపెద్ద కొనుగోలుదారులలో మనం ఒకరం. ఒక్కసారిగా భారత్ నుంచి డిమాండ్ తగ్గిపోతే, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు దారుణంగా పడిపోయే అవకాశం ఉంది. మార్కెట్లో బంగారం ఎక్కువగా ఉండి, కొనేవారు తక్కువగా ఉండటం వల్ల గ్లోబల్ ప్రైసెస్ కరెక్షన్ కి గురవుతాయి. కానీ విచిత్రం ఏమిటంటే, ప్రపంచ మార్కెట్లో ధరలు తగ్గినా, మన దేశంలో మాత్రం లభ్యత తక్కువగా ఉండటం వల్ల ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. మన ఆర్థిక వ్యవస్థకు లాభమా? నష్టమా? బంగారం అనేది పెట్రోల్ తర్వాత భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే రెండో వస్తువు. దీని కోసం మనం ఏటా దాదాపు 60 నుంచి 70 బిలియన్ల విదేశీ కరెన్సీని ఖర్చు చేస్తున్నాం. ఒకవేళ ఈ కొనుగోళ్లు ఆపితే, ఆ డాలర్లన్నీ ఆదా అవుతాయి. దీనివల్ల మన రూపాయి విలువ పెరగడమే కాకుండా, కరెంట్ అకౌంట్ డెఫిసిట్ తగ్గుతుంది. ఆ మిగిలిన సొమ్మును క్రూడ్ ఆయిల్ వంటి అత్యవసర వనరుల కోసం ప్రభుత్వం వాడుకోవచ్చు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక రకంగా మేలు చేస్తుంది. పరిశ్రమపై ప్రతికూల ప్రభావం మరోవైపు, ఈ నిర్ణయం వల్ల 'జెమ్స్ అండ్ జ్యువెలరీ' రంగం తీవ్రంగా దెబ్బతింటుంది. మన దేశంలో ఈ రంగంపై దాదాపు ఒక కోటి మందికి పైగా కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. బంగారం అమ్మకాలు నిలిచిపోతే, వారందరూ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే మార్కెట్లో ఈ వార్తల వల్ల జ్యువెలరీ కంపెనీల షేర్లు పతనం అవుతున్నాయి. పైగా, ప్రభుత్వం చట్టపరంగా బంగారంపై ఆంక్షలు విధిస్తే.. స్మగ్లింగ్ పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే మన దేశంలో పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం అవసరం కచ్చితంగా ఉంటుంది, కాబట్టి ప్రజలు దొంగచాటుగానైనా కొనడానికి ప్రయత్నిస్తారు. ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే! ప్రజలు భౌతికంగా బంగారాన్ని కొని దాచుకోవడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్దగా ఉపయోగం ఉండదు. అందుకే ప్రభుత్వం గోల్డ్ ఈటీఎఫ్‌లు , సావరిన్ గోల్డ్ బాండ్ల వైపు ప్రజలను మళ్లించే ప్రయత్నం చేస్తోంది. దీనివల్ల మీకు బంగారం ధర పెరిగినప్పుడల్లా లాభం వస్తుంది, కానీ దిగుమతి చేసుకునే అవసరం ఉండదు. మరోవైపు, సామాన్యులను కొనొద్దని చెబుతున్నా.. దేశ ఆర్థిక భద్రత కోసం ఆర్బీఐ మాత్రం తన వద్ద రికార్డు స్థాయిలో 880 టన్నుల బంగారాన్ని నిల్వ ఉంచుతోంది. మొత్తానికి, భారత్ బంగారం కొనడం ఆపేస్తే ఆర్థికంగా డాలర్లు ఆదా అవ్వొచ్చు కానీ, సామాజికంగా , ఉపాధి పరంగా భారీ ఇబ్బందులు తప్పవు. బంగారం అనేది మన సంస్కృతిలో భాగం కాబట్టి, డిమాండ్ అనేది ఎప్పటికీ తగ్గకపోవచ్చు.


# బెంగళూరులో బతకాలంటే నెలకి రూ. రూ. 1.3 లక్షలు కావాలి



కుటుంబం ఖర్చుపై సోషల్ మీడియాలో హాట్ డిబేట్.. బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయం పై ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చకు దారి తీస్తోంది. రాధిక, ఏకాంశ్ అనే జంట పంచుకున్న వివరాలు ఒక ప్రధాన ఉదాహరణగా నిలిచాయి. పూర్తిస్థాయి ఉద్యోగాలతో పాటు కంటెంట్ క్రియేటర్లుగా రాణిస్తున్న ఈ జంట, విహారయాత్రలు లేదా విలాసవంతమైన ఖర్చులు కాకుండా కేవలం ప్రాథమిక జీవనశైలి కోసమే ప్రతి నెలా సుమారు రూ. 1.3 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భారతదేశపు ఐటీ రాజధానిలో మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గాల ఆర్థిక స్థితిగతులను ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ దంపతుల బడ్జెట్‌లో సింహభాగం ఇంటి అద్దెకే వెళ్తోంది. నెలకు రూ. 56,000 అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపిన వారు, ఈ మొత్తాన్ని 'రెండవ ఈఎంఐ'తో పోల్చడం గమనార్హం. ఐటీ నిపుణులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయనే వాస్తవానికి ఇది నిదర్శనం. ఉద్యోగ బాధ్యతల వల్ల ఇంటి పనుల కోసం వారు మరో రూ. 10,000 కేటాయిస్తున్నారు. ఇక నిత్యావసరాలైన కిరాణా సామాగ్రికి రూ. 15,000, విద్యుత్, ఇంటర్నెట్ వంటి యుటిలిటీ సేవల కోసం మరో రూ. 15,000 ఖర్చవుతోంది. రవాణా ఖర్చులు, పెట్రోల్ వంటి వాటి కోసం నెలకు రూ. 6,000 వినియోగిస్తున్నారు. కేవలం అవసరాలకే కాకుండా, ఆధునిక నగర జీవనంలో భాగంగా మారిన ఇతర ఖర్చులు కూడా వీరి బడ్జెట్‌లో గణనీయంగా ఉన్నాయి. బయట భోజనం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీల కోసం రూ. 10,000, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ల కోసం రూ. 3,000 ఖర్చు చేస్తున్నారు. వీటితో పాటు షాపింగ్, ఇతర అనుకోని ఖర్చుల కోసం నెలకు మరో రూ. 15,000 పక్కన పెడుతున్నారు. విమాన ప్రయాణాలు లేదా సెలవుల ఖర్చులు కలపకుండానే నెలకు రూ. 1.3 లక్షలు అవ్వడం గమనార్హం.ఎంత సంపాదించినా నెల ఆఖరికి డబ్బులు మిగలడం లేదు అన్న వారి వ్యాఖ్య నగరవాసుల మానసిక స్థితిని తెలియజేస్తోంది. రూ. 70 లక్షల ప్యాకేజీ.. కానీ సేవింగ్స్ సున్నా! వైరల్ అవుతున్న శాలరీ బ్రేకప్! ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు విభిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు వినియోగదారులు ఈ ఖర్చులను తీవ్రంగా విమర్శించారు. అధిక అద్దె ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవడం వారి వ్యక్తిగత నిర్ణయమని, దీవఅస్త్రుశ్రీబతీబ లో తక్కువ ఖర్చుతో కూడా జీవించవచ్చని వారు వాదించారు. ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబాలు కూడా ఇంతకంటే తక్కువ ఖర్చుతో నెట్టుకొస్తున్నారని మరికొందరు గుర్తుచేశారు. అయితే, మరో వర్గం ప్రజలు ఈ జంటను సమర్థించారు. సౌకర్యవంతమైన, నాణ్యమైన జీవనశైలిని కోరుకునే వారికి బెంగళూరు వంటి నగరాల్లో ఇవి కనీస ఖర్చులేనని వారు అభిప్రాయపడ్డారు. ఇతర నగరాలతో పోలిస్తే ఇక్కడ నివాస వ్యయం చాలా ఎక్కువగా ఉందని, ఒక మంచి నగరంలో లభించే అవకాశాలకు మనం చెల్లించాల్సిన మూల్యం ఇదేనని పలువురు వ్యాఖ్యానించారు. ఈ చర్చ ద్వారా నగరాల్లో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మారుతున్న ప్రజల జీవన ప్రమాణాల మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# 8వ పే కమిషన్ కీలక అప్‌డేట్

ఎనిమిదవ వేతన సంఘం తెలుగు రాష్ట్రాల పర్యటన వివరాలు ఇవిగో.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్యత్తును నిర్ణయించే 8వ కేంద్ర వేతన సంఘం కార్యకలాపాలు ఇప్పుడు కీలక దశకు చేరుకున్నాయి. ప్రతి పదేళ్లకు ఒకసారి ఏర్పాటు చేసే ఈ కమిషన్, సుమారు 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్ల జీతభత్యాలు, పెన్షన్ విధానాలను పునర్నిర్మించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఈ కమిషన్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ.. సంబంధిత భాగస్వాముల నుండి అభిప్రాయాలను సేకరించే పనిలో నిమగ్నమై ఉంది. ఉద్యోగ సంఘాలు, వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కమిషన్ ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసింది. దీని ప్రకారం 2026 మే 13, 14 తేదీలలో ఢిల్లీలో రైల్వే, రక్షణ మంత్రిత్వ శాఖల పరిధిలోని యూనియన్లతో కీలక సమావేశాలు జరగనున్నాయి. ఆ తర్వాత కమిషన్ తన పర్యటనను దక్షిణాదికి విస్తరిస్తూ, మే 18-19 తేదీలలో హైదరాబాద్‌లో తెలంగాణకు చెందిన వాటాదారులతో చర్చలు జరుపుతుంది. జూన్ నెలలో పర్యటనలు ఉత్తరాదికి మారుతాయి; జూన్ 1 నుండి 4 వరకు జమ్మూ & కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో, ఆపై జూన్ 8న లడఖ్‌లో సమావేశాలు నిర్వహిస్తారు. వీటితో పాటు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కూడా ప్రత్యేక సమావేశం ఉంటుందని కమిషన్ వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2025లో ప్రకటించబడిన ఈ కమిషన్‌కు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాష్ దేశాయ్ అధ్యక్షత వహిస్తున్నారు. ఇందులో సభ్యులుగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, సభ్య కార్యదర్శిగా పంకజ్ జైన్ వ్యవహరిస్తున్నారు. ఈ ప్యానెల్ కేవలం వేతనాలను పెంచడమే కాకుండా, కరువు భత్యం ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్, ఇతర అలవెన్సుల విషయంలో శాస్త్రీయమైన విశ్లేషణ చేస్తుంది. కార్మిక సంఘాలు, పెన్షన్ సంస్థలు, వివిధ విభాగాల నుండి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త వేతన నిర్మాణాన్ని సిఫార్సు చేస్తుంది. 8వ వేతన సంఘం: మీ జీతం ఎంత పెరగబోతోంది? కేంద్రం కీలక నిర్ణయం! భాగస్వాములందరికీ తమ వినతులను సమర్పించేందుకు తగిన సమయం కల్పించాలనే ఉద్దేశంతో, కమిషన్ మెమోరాండం సమర్పణ గడువును 2026 మే 31 వరకు పొడిగించింది. నిజానికి



ఈ ప్రక్రియ మార్చిలో ప్రారంభమై ఏప్రిల్‌తో ముగియాల్సి ఉన్నప్పటికీ, అభ్యర్థనల మేరకు ఒక నెల అదనపు సమయం ఇచ్చారు. ఈ సంప్రదింపుల ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత, కమిషన్ ప్రారంభమైన 18 నెలలకు, అంటే 2025 నవంబర్ 3 నాటికి తుది నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదికలో సూచించే అంశాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవన ప్రమాణాలను మరియు ఆర్థిక భవిష్యత్తును గణనీయంగా ప్రభావితం చేస్తాయి.

# స్టాక్ మార్కెట్‌లో సంచలనం



వ్యాల్యూ 360 ఐపీఓ లిస్టింగ్.. ఇన్వెస్టర్లకు లాభాల పంట పండుతుందా వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ నేడు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లో అడుగుపెట్టింది. ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈ ప్లాట్‌ఫామ్‌పై ఈ కంపెనీ షేర్లు లిస్ట్ అయ్యాయి. భారతీయ పబ్లిక్ రిలేషన్స్‌రంగంలో ఇదొక కీలక మైలురాయిగా నిలవనుంది. మార్కెట్ ప్రారంభంలో ఓపెనింగ్ ప్రైస్ ఎలా ఉంటుందోనని ఇన్వెస్టర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సర్వీస్ సెక్టార్‌లో కనిపిస్తున్న భారీ వృద్ధికి ఈ పరిణామం ఒక నిదర్శనం. ఈ ఐపీఓకు రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. మూడు రోజుల బిడ్డింగ్ సమయంలో షేర్లకు భారీ డిమాండ్ ఏర్పడిందని మార్కెట్ నిపుణులు గమనించారు. సర్వీస్ ఆధారిత స్టార్టప్ మోడల్స్‌పై ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకాన్ని ఈ ఆసక్తి చాటిచెబుతోంది. గత రెండు దశాబ్దాలుగా ఈ సంస్థ సాధించిన వృద్ధికి ఈ లిస్టింగ్ ధర అద్దం పడుతోంది. దేశీయ కన్సల్టింగ్ ఏజెన్సీల విజయగాథలో ఇదొక అరుదైన ఘట్టం. వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ ఐపీఓ లిస్టింగ్ విశేషాలు ఇన్వెస్టర్లను ఆకర్షించేలా కంపెనీ తన ప్రైస్ బ్యాండ్‌ను నిర్ణయించింది. ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఎక్స్‌పాన్షన్, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం ఉపయోగించనున్నారు.



# ‘రాకా’ నుంచి గ్లింప్స్ రాబోతుందా?

## అల్లు అర్జున్ మూడు షేడ్స్‌లో కనిపించబోతున్నాడా..!

‘పుష్ప’ ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా ‘రాకా’ పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ‘రాకా’ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. సినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా ‘రాకా’ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే ‘రాకా’ ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ-బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వెండితెరపై ఎంట్రీ ఇస్తున్న ‘రాను బొంబాయికి రాను’ భామ!



‘రాను బొంబాయికి రాను’ ఫోక్ సాంగ్ ఎంత సూపర్ హిట్ అయిందో అందరికి తెలిసిందే. లిరిక్స్ కంటే ఎక్కువగా రామ్ రాథోడ్, లిఖిత వేసిన స్టెప్పులు బాగా వైరల్ అయ్యాయి. అంతేకాదు ఈ ఒక్క పాటతో లిఖిత..తెలుగు ఆడియన్స్‌కి బాగా దగ్గరైంది. ఈ పాట తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళ్తుంది. అయితే ఇన్నాళ్లు ప్రైవేట్ ఆల్బమ్స్‌తో అలరించిన లిఖిత..ఇక ఇప్పుడు హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఆమెను టాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్నాడు. సామ్రాట్, డీమోన్ పవన్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రానికి ‘సాం3’ అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ రోజు పూజా కార్యక్రమాలతో ‘సాం3’ సినిమా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అశోక్ కుమార్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ – డైరెక్టర్ గారు ఈ స్క్రిప్ట్ చెబుతున్నప్పుడే మూవీ ఎలా ఉంటుంది అనేది క్లియర్ గా తెలిసింది. నేను ఫోక్ సాంగ్స్ నుంచి చిన్న గ్యాప్ తీసుకున్నాను. హీరోయిన్ గా మంచి రోల్స్ చేయాలనే ఫోక్ సాంగ్స్ కు గ్యాప్ ఇచ్చాను. అయినా మంచి ఆల్బమ్ వస్తే తప్పకుండా చేస్తాను. నేను ఒక బెస్ట్ స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్న టైమ్ లో ఈ మూవీ ఆఫర్ వచ్చింది. సామ్రాట్, పవన్ లాంటి కోస్టార్స్ దొరకడం హ్యాపీగా ఉంది. ఎలాంటి స్క్రిప్ట్ పేపర్ లేకుండా మేమంతా కథను ఓన్ చేసుకుని నటించాం. అదంతా మా డైరెక్టర్ వల్లే సాధ్యమైంది’ అన్నారు. దర్శకుడు కృష్ణమాయ మాట్లాడుతూ... లిఖి, డీమోన్ పవన్ కొత్త వాళ్లు ఎలా నటిస్తారో అనుకున్నాను గానీ పర్ ఫార్మెన్స్ ఇరగదీశారు. మా టెక్నీషియన్స్ అందరూ అద్భుతమైన ఔట్ పుట్ ఇచ్చారు. ‘సాం3’ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం’ అన్నారు. హీరో డీమోన్ పవన్ మాట్లాడుతూ – బిగ్ బాస్ తర్వాత నేను ఎలాంటి మూవీ చేయాలని ఆలోచిస్తున్న టైమ్ లో డైరెక్టర్ కృష్ణ మాయ ఈ స్క్రిప్ట్ చెప్పారు. చాలా మంచి స్క్రిప్ట్ ఇది. ఆయన స్క్రిప్ట్ చెబుతుంటే ఇంకా వినాలని అనిపించింది. అంత ఎక్స్ ప్రెసివ్ గా స్టోరీ చెప్పారు. ఇలాంటి దర్శకుడితో వర్క్ చేస్తే నటుడిగా నాకు మంచి పేరొస్తుందని నమ్మాను. మేమంతా ఈ సినిమా కోసం ఎలాంటి డైలాగ్స్ లేకుండా ఆన్ సెట్ ఇంప్రూవైజ్ చేసుకుంటూ నాచురల్ గా నటించాం. తక్కువ టైమ్ లో మేమంతా క్వాలిటీగా సినిమా చేశాం. అన్నారు.



# శింబు టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమా?.. తెలుగు డెబ్యూపై మళ్లీ జోరందుకున్న చర్చ

కోలీవుడ్ స్టార్ హీరో శింబుకు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమాన వర్గం ఉంది. ఆయన నటించిన అనేక తమిళ చిత్రాలు తెలుగులో డబ్బింగ్ అయి మంచి విజయాలు సాధించడంతో టాలీవుడ్‌లో కూడా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే ఇంతటి క్రేజ్ ఉన్నప్పటికీ శింబు ఇప్పటివరకు నేరుగా తెలుగు సినిమాలో నటించలేదు. దీంతో ఆయన టాలీవుడ్ ఎంట్రీ గురించి తరచూ వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఈ అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని నెలలుగా శింబు ఓ ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థతో సినిమా చేయబోతున్నారనే ప్రచారం సాగుతోంది. గతంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో శింబు హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. మనసనమహా’ షార్ట్ ఫిల్మ్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు దీపక్ రెడ్డి చెప్పిన కథ నిర్మాతలను ఆకట్టుకుందని, శింబు కూడా ఆ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆ తర్వాత ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.ఇప్పుడు తాజాగా మరో కొత్త కథతో శింబు ముందుకు వచ్చినట్లు సమాచారం. యువ దర్శకుడు కీర్తిశ్వరన్ చెప్పిన కథ ఆయనను బాగా ఆకట్టుకుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన ‘డ్యూడ్’ చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తిశ్వరన్, కొత్త తరహా కథాంశంతో శింబును మెప్పించినట్లు తెలుస్తోంది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఇక శింబు కెరీర్ విషయానికి వస్తే, బాలనటుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన ఆయన 2002లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. ప్రేమకథలు, యాక్షన్ డ్రామాలు, మాస్ ఎంటర్‌టైనర్‌లతో తమిళ ప్రేక్షకులను అలరిస్తూ స్టార్ హీరోగా ఎదిగారు. ఒక దశలో తెలుగులో కూడా ఆయన సినిమాలకు మంచి మార్కెట్ ఏర్పడింది. అయితే వరుస పరాజయాలు, వ్యక్తిగత వివాదాల కారణంగా కొంతకాలం కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తిరిగి వరుస విజయాలతో బలంగా కమ్‌బ్యాక్ ఇచ్చిన శింబు, ప్రస్తుతం తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు మార్కెట్‌పై దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురు తమిళ హీరోలు నేరుగా తెలుగు సినిమాలు చేసి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో శింబు కూడా అదే బాటలో నడవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



# ఏడేళ్ల ప్రేమకు పెళ్లి ముహూర్తం..

## ప్రియాంక జైన్‌తో వివాహంపై క్లారిటీ ఇచ్చిన శివకుమార్

తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు ఎంతో పరిచయమైన జంటల్లో ప్రియాంక జైన్, శివకుమార్ ఒకరు. ‘మౌనరాగం’ సీరియల్ ద్వారా పరిచయమైన వీరిద్దరూ మొదట మంచి స్నేహితులుగా మారి, ఆ తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ప్రస్తుతం లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో కూడా కొనసాగుతోంది.వీరి ప్రేమ వ్యవహారం గురించి అభిమానులకు ఎప్పటి నుంచో తెలుసు. దీంతో సోషల్ మీడియాలోనూ, ఇంటర్వ్యూల్లోనూ వీరిద్దరికి తరచూ ఎదురయ్యే ప్రశ్న ఒక్కటే.. “పెళ్లి ఎప్పుడు?” అనే విషయం. తాజాగా ఈ ప్రశ్నకు శివకుమార్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు.ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తమ ప్రేమ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మాది ఏడేళ్ల ప్రేమ. మొదట ప్రియాంకే నాకు ప్రపోజ్ చేసింది. ఆమె ప్రపోజ్ చేసిన రెండు రోజుల తర్వాత నేను ఓకే చెప్పాను. అప్పటి నుంచి మా బంధం మరింత బలపడింది అని తెలిపారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌పై కూడా ఆయన స్పందించారు. మేము కలిసి ఉండటానికి ముందే మా కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్నాం. రెండు కుటుంబాలు కూడా మా నిర్ణయాన్ని గౌరవించాయి. వారి అంగీకారంతోనే మేము లివ్-ఇన్‌లో ఉన్నాం అని చెప్పారు. పెళ్లి విషయానికి వస్తే, ప్రస్తుతం ఇద్దరూ కలిసి ఒక ఇంటిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మా కలల ఇల్లు నిర్మాణంలో ఉంది. అది పూర్తయిన వెంటనే ఈ ఏడాదిలోనే పెళ్లి చేసుకుంటాం. పెళ్లి కోసం ఇప్పటికే కొన్ని ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నాం అని అన్నారు. తమ వివాహాన్ని ఉత్తరాఖండ్‌లోని ఓ పవిత్ర ఆలయంలో నిర్వహించాలని భావిస్తున్నట్లు శివకుమార్ తెలిపారు. యోగి నారాయణ్ ఆలయంలో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం. పురాణాల ప్రకారం శివపార్వతుల వివాహం కూడా అక్కడే జరిగినట్లు చెబుతారు. అందుకే ఆ ప్రదేశం మాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది అని వివరించారు.ఆలయంలో సాంప్రదాయబద్ధంగా వివాహం జరిగిన అనంతరం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే భవిష్యత్తులో నిర్మిస్తున్న ఇంట్లో రెండు కుటుంబాలు కలిసి ఉండేలా ప్రణాళికలు వేసుకున్నామని వెల్లడించారు. నేను నా కుటుంబంతో, ప్రియాంక తన కుటుంబంతో కాకుండా అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండాలని కోరుకుంటున్నాం. కుటుంబ బంధాలకు మేము ఎంతో విలువ ఇస్తాం అని శివకుమార్ తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com